ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 14.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 234 పేజీలు:12 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

సౌతాఫ్రికాతో తొలి టెస్టుకు టీమిండియా సిద్ధం 12

నేడే జూబ్లీహిల్స్ కౌంటింగ్

ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం

- 58 మంది అభ్యర్థుల కోసం 42 టేబుళ్లు
- మొదట పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్
- మొత్తం 10 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి
- కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన భద్రత
- 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలు
- వివరాలను వెల్లడించిన సీఈఓ సుదర్శన్ రెడ్డి
- కలవరపెడుతున్న తక్కువ పోలింగ్ శాతం
- గెలుపు మీద పార్టీల ఎవరి ధీమా వారిదే

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 13: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుంది. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ కౌంటింగ్ జరుగుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ తర్వాత 407 కేంద్రాల ఓట్లను 10 రౌండ్లలో లెక్కిస్తారు. 58 మంది అభ్యర్థుల కోసం 42 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కేంద్రం వద్ద పటిష్ట భద్రత, 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కౌంటింగుకు సంబంధించిన వివరాలను సీఈఓ సుదర్శన్ రెడ్డి, ఈఓ ఆర్వీ కర్ణన్ మీడియాకు వివరించారు. ఇక్కడ 48.49 శాతం పోలింగ్ నమోదైంది. తక్కువ పోలింగ్ శాతం ఏ పార్టీకి లాభిస్తుందనే ఉత్కంఠ కొనసాగుతుండగానే, అత్యధిక పోలింగ్ నమోదైన ప్రాంతాలే గెలుపును నిర్ణయించబోతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆసక్తికర అంశం ఏమిటంటే, 407 కేంద్రాలలోని 34 కేంద్రాలలో 60 శాతానికిపైగా, 192 కేంద్రాలలో 50 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. ఇక్కడ ఎక్కువ ఓట్లు సాధించిన పార్టీనే విజయాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉందని అంటున్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ 73 కేంద్రాలలో

..:: మిగతా 2లో

తెలంగాణ ఉత్తమ రాష్ట్రం

ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం

భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని, హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ముఖ్య రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామన్నారు. సదస్సు ప్రారంభంలో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో ఈ విజన్ విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది.

- సకల వసతులకు ఇది నిలయం
- ఇక్కడ అనువైన వాతావరణం ఉంది
- పెట్టుబడిదారులకు అండగా ఉంటాం
- ఇక్కడి ప్రభుత్వాలు ఎప్పుడూ మద్దతుగా ఉన్నాయి
- హైదరాబాద్ ను ప్రపంచ నగరంగా తీర్చిదిద్దుతాం
- అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- మూసీ నది పురుజ్జీవనంతో మరింత ప్రయోజనం
- టోక్యో, దుబాయి, సియోల్ సరసన భాగ్యనగరం
- హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశకు వస్తుంది
- యూఎస్ఐఎస్పీఎఫ్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి
- సీఎం తెలంగాణ విజన్‌పై టెక్ దిగ్గజాల ప్రశంసలు
- హైదరాబాద్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతామని హామీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, నవంబర్ 13: అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం జరిగిన 'అమెరికా సంయుక్త రాష్ట్రాలు -భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య' సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 యేండ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు మద్దతుగానే నిలిచారని వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని అన్నారు. జీసీసీలకు గమ్య స్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులే కాకుండా అత్యున్నత

..:: మిగతా 2లో

ఆర్టీసీలో టికటేతర ఆదాయం పెరగాలి

- రెవెన్యూ పెంచుకునే అవకాశాలు అన్వేషించాలి
- నష్టాలలో ఉన్న డిపోలు లాభాల బాట పట్టాలి
- ఇందుకోసం ఓ కమిటీని నియమించండి
- కొత్త కాలనీలకు కూడా బస్సు సౌకర్యం కల్పించాలి
- మేడారం జాతరకు 3,800 బస్సులు నడుపుతాం
- సమీక్ష సమావేశంలో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్13: సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత క్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుండి నెలవారీగా వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా, అదనపు ఆదాయంపైనా దృష్టి సాధించాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు మహిళలు 237 కోట్ల

..:: మిగతా 2లో

టీచర్లందరూ టెట్ పాస్ కావాల్సిందే

- స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మార్గదర్శకాలను సవరించిన విద్యా శాఖ
- తాజాగా టెట్ నోటిఫికేషన్ విడుదల
- రేపటి నుంచి 29 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జనవరి 3 నుంచి 31 వరకు టెట్ నిర్వహణ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్13: టీచర్లకు ప్రభుత్వం షాకిచ్చింది. తెలంగాణలో ఇకపై సర్వీస్ టీచర్లు సైతం టెట్ క్వాలిఫై కావాల్సిందేనని స్పష్టం చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం జారీ చేయనుంది. ఇకపై టీచర్లు సర్వీస్‌లో ఉండాలన్నా, ప్రమోషన్లు పొందాలన్నా టెట్ క్వాలిఫై తప్పనిసరని ప్రభుత్వం

..:: మిగతా 2లో

టెక్నాలజీనీ సొంతం చేసుకుంటేనే 'సక్సెస్'

- విద్యార్థులు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలి
- తెలంగాణ ప్రభుత్వం కలలను నిజం చేయాలి
- టీ -సాట్ వేదికపై ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు
- వార్షిక పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్13: విద్యార్థులు సక్సెస్ సాధించాలంటే టెక్నాలజీలో మంచి ప్రావీణ్యం సంపాదించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. జూబ్లీహిల్స్ లోని టీ సాట్ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల 'రాష్ట్రస్థాయి వార్షిక పోటీలు 2025' విజేతల బహుమతి ప్రదానోత్సవానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అత్యంత వేగంగా

..:: మిగతా 2లో

బీసీ దీక్షలతో ఢిల్లీ దిగి రావాలి

- రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లాలి
- కేంద్రంపై పోరాటానికి కార్యాచరణ ప్రకటించాలి
- పార్టీలకు అతీతంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలి
- బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్13: బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడానికి డిసెంబర్ ఒకటి నుండి జరిగే పార్లమెంట్ సమావేశాలలో ఒత్తిడి తీసుకురావాలని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇందుకోసం రాజ్యాంగాన్ని సవరించేలా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోడీతో భేటీ కావాలని డిమాండ్ చేశారు. ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరపున పార్లమెంటు సమావేశాలను స్తంభింపచేయాలని సూచించారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద బీసీల ధర్మపోరాటం దీక్షలు నిర్వహించారు. బీసీ జేఏసీ కోఆర్డినేటర్ లు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షకు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వం వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ,

..:: మిగతా 2లో

మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు

బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులో రూ. 3 వేలకు పైగా పెరిగి రూ. 1,31,500కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,17,000 పైన పలుకుతోంది.

11

ఫిరాయింపు ఎమ్మెల్యేపై అనర్హత వేటు

ఫిరాయింపు ఎమ్మెల్యే మీద కోల్ కతా హైకోర్టు అనర్హత వేటు వేసింది. బీజేపీ టికెట్ మీద ఎమ్మెల్యేగా గెలిచిన ముకుల్ రాయ్ టీఎంసీలో చేరారు. దీనిపై బీజేపీ నాయకులు వేసిన అనర్హత పిటిషన్ మీద హైకోర్టు విచారణ జరిపింది.

11

ఆల్ ఫలా వర్సిటీకి 'న్యాక్' నోటీసులు

ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో అల్ ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు వైద్యులు అనుమానితులుగా ఉండటంతో ఈ విశ్వవిద్యాలయం పేరు తెర మీదకు వచ్చింది.

11

ముస్లింలంతా ఉగ్రవాదులు కారు

ఢిల్లీలో బాంబు పేలుడు నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌కు చెందినవారిపై, ముఖ్యంగా కశ్మీరీ ముస్లింలపై వివక్ష చూపించే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు.

11

రాష్ట్రీయం

నేడే జూబ్లీహిల్స్ కౌంటింగ్

మొదటిపేజీ తరువాయి

50 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదైంది. బోరబండ డివిజన్ 47 కేంద్రాలు 50 శాతం కంటే ఎక్కువ ఓటింగ్ నమోదు చేశాయి, 13 కేంద్రాలలో 60 శాతం దాటింది. ఎర్రగడ్డ 30 కేంద్రాలలో 50 శాతం కంటే ఎక్కువ, మూడు కేంద్రాలలో 60 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదైంది.

ధనిక వర్గాలు నివసించే ప్రాంతాలు అత్యల్పంగా

వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్లలోని కాలనీ ప్రాంతాలు, ముఖ్యంగా ధనిక వర్గాలు నివసించే ప్రాంతాలు అత్యల్పంగా ఓటు వేశాయి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఓటేసిన 217వ కేంద్రంలో అత్యల్పంగా 28.61 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఇక్కడ పోలీసులు, అద్దెకు ఉండే ఓటర్లు నివాసాలు మారడం వల్ల ఓటింగ్ తగ్గింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటేసిన 290వ కేంద్రంలో 32.82 శాతం, భాజపా అభ్యర్థి దీపక్‌రెడ్డి ఓటేసిన 301వ కేంద్రంలో 41.86 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా బోరబండ రాజ్‌నగర్ 334వ కేంద్రంలో 72.78 శాతం పోలింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్‌తో సంబంధం లేకుండా, ఈ గణాంకాల ఆధారంగానే అభ్యర్థులు గెలుపుపై లెక్కలు వేసుకుంటున్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. 407 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపునకు, బరిలో ఉన్న 58 మంది అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని 42 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానుంది. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌తో పాటు మీడియా కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ ఈడీ స్క్రీన్లపై ప్రదర్శిస్తారు. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 250 మంది పోలీసులు, 15 ప్లాటూన్ల సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

బీసీ దీక్షలతో ఢిల్లీ దిగి రావాలి

మొదటిపేజీ తరువాయి

ప్రొఫెసర్ కోదండరాం, జూలూరి గౌరీ శంకర్, గిరిజన సంఘం నాయకులు సంజీవ నాయక్, సీపీఎం నేత ఆశన్న, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్, ప్రొఫెసర్ బాగయ్యతోపాటు 136 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, 40 బీసీ సంఘాల అధ్యక్షులు, 10 ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, మహిళా సంఘాల నేతలు, ఓయూ జేఏసీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇందూరు జిల్లాకు సుదర్శన్ రెడ్డి మంత్రి

- ఆయన ఆధ్వర్యంలో అభివృద్ధి సాధిస్తాం
- సన్మాన సభలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 13 : జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మాత్రమే కాదని ఈ జిల్లాకు మంత్రి అని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాల సుదర్శన్ రెడ్డి తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా పాత కలెక్టరేట్ మైదానంలో సన్మాన సభ నిర్వహించారు. మాధవ నగర్ నుంచి బోర్గాం (పి) చౌరస్తా, వినాయ కనగర్. అంబేడ్కర్ చౌరస్తా మీదుగా పాత జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సుదర్శన్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాను అభివృద్ధి చేస్తామని అన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల తోపాటు, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 20, 21, 22 ప్యాకేజీ తీసుకురావడంతో తీసుకురావడంలో ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. మన 35 యేండ్ల కల అయిన ఇంజినీరింగ్ కళాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరు చేశామని తెలిపారు. తెలంగాణ వర్సిటీ పరిధిలో వ్యవసాయ కళాశాలను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ ముఖ్య సలహాదారు , సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధే తమ ధ్యేయమని పేర్కొన్నారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, విజయకాంత్ రెడ్డి, సుడా చైర్మన్ కేశ వేణు, మాజీ మేయర్ సంజయ్, కవితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనవరిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలు

- అడహక్ కమిటీ కన్వీనర్ గా రాంచందర్
- అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, ఇండస్థలాలపై సర్కారుకు వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలను జనవరి చివరి వారంలో నిర్వహించాలని రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం తీర్మానించింది. మహాసభల నిర్వహణ కోసం సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు పి.రాంచందర్ ను కన్వీనర్ గా నియమించింది. మరో 23 మందితో అడహక్ కమిటీ ఏర్పాటు చేసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీనియర్ జర్నలిస్ట్ పిల్లి రాంచందర్ అధ్యక్షతన ఫెడరేషన్ గురువారం జరిగింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు జి. మాణిక్ ప్రభు, తాటికొండ కృష్ణ, గుడిగ రఘు, బి. రాజశేఖర్, కార్యదర్శులు ఎస్కే సలీమా, ఈ చంద్రశేఖర్, బి. జగదీశ్, కొప్పు నిరంజన్, బి. దయాసాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మణిమాల, విజయ, బీవీఎన్ పద్మరాజు పాల్గొన్నారు. 33 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, స్టేట్ కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్, అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్లు, ఇండ్లస్థలాలు, హెల్తాకార్డుల విషయంలో త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. మామిడి సోమయ్య, బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితూడి బాపూరావు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడంతో పాటు సంఘం నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాన్ని విస్తృతస్థాయి సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సోమయ్య ఏకపక్షంగా వేసిన జిల్లా కమిటీలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.

తెలంగాణ ఉత్తమ రాష్ట్రం

మొదటిపేజీ తరువాయి

జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు.

23 నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి

గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుత మౌలిక వసతులతో 30 వేల ఎకరాలలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్ – ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. చైనా +1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీలీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను సీఎం ఆహ్వానించారు.



రోడ్లకు మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ

భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని, హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ముఖ్య రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామన్నారు. సదస్సు ప్రారంభంలో 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్' ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్నారు. విజన్ సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. కాగా, 'సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉంది. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం' అని యూఎస్ఐఎస్పీఎఫ్ అధ్యక్షుడు డా. ముఖేష్ ఆఘి అన్నారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతామన్నారు. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని తామంతా ఆసక్తిగా ఉన్నామని చెప్పారు.

టీచర్లందరూ టెట్ పాస్ కావాల్సిందే

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టెట్ నిబంధనలను తెలంగాణ విద్యా శాఖ సవరించింది. 2009 తర్వాత నియమితులైన 30 వేల మంది టీచర్లకు ఈ నిబంధన వర్తించనుంది. రెండేండ్లలో సర్వీసులో ఉన్న టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సిందేనన్నది సుస్పష్టం. తెలంగాణ విద్యా శాఖ గురువారం నాడు టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. శనివారం నుంచి ఈ దరఖాస్తులను అభ్యర్థుల నుండి స్వీకరిస్తారు. 29వ తేదీతో ఈ దరఖాస్తుల స్వీకరణ ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ నిర్వహిస్తారు. కాగా, ఈ యేడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. ఫలితాలు జూలై 22న వెల్లడయ్యాయి. గురువారం రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా ఈ టెట్‌లో అర్హత సాధించాలంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాలలో కొనసాగాలంటే, ప్రభుత్వ పాఠశాలలలో విధులు నిర్వహిస్తున్న టీచర్లంతా ఈ పరీక్ష పాస్ కావాల్సి ఉంది.

టెక్నాలజీని సొంతం చేసుకుంటేనే 'సక్సెస్'

మొదటిపేజీ తరువాయి

వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానాన్ని అంచనావేయలేకపోతున్నామన్నారు. విద్యార్థుల మేథో సంపత్తికి టీ సాట్ సాంకేతికను ఉపయోగించుకుని తమ తమ భవిష్యత్ కు గట్టి పునాదులు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విజయం సాధిస్తే టీచర్లు మొదటగా, ఆ తరువాత తల్లిదండ్రులు సంతోషిస్తారని, చదువులో మొదటి స్థానమే కాకుండా ఇలాంటి కార్యక్రమాలు చాలా ముఖ్యం అని అన్నారు. విద్యార్థులలో నైపుణ్యం వెలికి తీసేందుకు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విజేతలైన 99 మంది విద్యార్థులు, ఒక్కరు సుమారు 2,200 విద్యార్థుల నాలెడ్జితో సమానమనే విధంగా భావించాలని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ కలలను ప్రభుత్వ బడుల విద్యార్థులు నిజం చేయాలన్నారు. టీ సాట్ సీఈఓ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన మంత్రి శ్రీధర్ బాబు టిసాట్ కు సంపూర్ణ మద్దతు అందచేస్తూ, తెలంగాణ విద్యార్థులు, యువతకు పరోక్షంగా చేయూనిస్తున్నారని కొనియాడారు. టీ సాట్ ఈడీ ఎండీ సాదిక్ స్వాగతోపన్యాసం చేయగా జీఎం లింగారెడ్డి వందన సమర్పన చేశారు.

ఆర్టీసీలో టికటేతర ఆదాయం పెరగాలి

మొదటిపేజీ తరువాయి

జీరో టికెట్ ఉపయోగించుకున్నారన్నారు. 7,980 కోట్ల రూపాయలు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. టికెట్ ఆదాయంతో పాటు టికెటేతర ఆదాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు, బస్ స్టేషన్లలో, టిమ్ మిషన్ల ద్వారా వచ్చే టికెట్ పై అడ్వర్టైజ్మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలన్నారు. ప్రస్తుతం నష్టాలలో కొనసాగుతున్న తాండూరు, వికారాబాద్, బీహెచ్ఈఎల్, మియాపూర్, కుషాయిగూడ, దిల్ సుఖ్ నగర్, హకీంపేట్, రాణిగంజ్, మిథానీ సహా పలు డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఎండీ నాగిరెడ్డిని ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

ఇప్పటికే 500 వరకు ఎలక్ట్రిక్ బస్సులు

నగరంలో ఇప్పటికే 500 వరకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని మంత్రి వివరించారు. పీఎం ఈ డ్రైవ్ కింద కేటాయించిన రెండు వేల బస్సులు విడతలవారీగా వస్తాయని, అందుకు సంబంధించిన చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న కొత్త కాలనీలకు, బస్సులు నడిపించేలా స్థానిక డీఎం ఇతర ఆర్టీసీ అధికారులతో ఆయా ప్రాంతాలలో పర్యటించి ఒక నివేదిక ను రూపొందించాలని ఆదేశించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 578 బస్సులు కొత్తగా రాష్ట్రంలో రోడ్డెక్కాయని, త్వరలో మరిన్ని కొత్త బస్సులు రానుండడంతో వాటిని ప్రయాణికుల ట్రాఫిక్ ఎక్కువగా ప్రాంతాలలో నడిపించాలని సూచించారు. ఆర్టీసీ లో 1000 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని, నియామకాలు వేగంగా పారదర్శకంగా జరిగేలా పూర్తి చేయాలని తెలిపారు. డిసెంబర్ చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ ,114 సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు.

మేడారం జాతర సమీపిస్తుండటంతో

మేడారం జాతర సమీపిస్తుండటంతో ములుగు బస్ స్టేషన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డిసెంబర్ లోపు స్లాబ్ పనులు పూర్తి చేయాలని జాతర సమీపిస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసారి జాతర కు 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణిస్తారని అంచనా వేసారని, 3,800 బస్సులు నడపడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఏటూరు నాగారం, పెద్దపల్లి బస్సు డిపోల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పుష్కరాల లోపు మంథని బస్ స్టేషన్ ఆధునీకరణ పూర్తి కావాలన్నారు. మధిర బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. హుజూర్ నగర్, కోదాడ బస్ స్టేషన్ శంకుస్థాపన వారం రోజులలో పూర్తి చేస్తామన్నారు. మిర్యాలగూడ అప్ గ్రేడేషన్ పనులు ప్రారంభించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్ నిర్మాణం , బస్ సౌకర్యాలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు అధ్యయనం చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మా ప్రభుత్వాన్ని ప్రజలకు అంకితం చేస్తాం

- ప్రజలకే మేము జవాబుదారీగా ఉంటాం
- డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క వెల్లడి

ప్రతిపక్షం ప్రతినిధి, ఖమ్మం, నవంబర్ 13 : ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వాన్ని ప్రజలకే అంకితం చేసామని, తాము ప్రజలకే జవాబుదారీగా ఉంటామని డిప్యూటీ సీఎం భట్టీ విక్రమార్క అన్నారు. గురువారం ఆయన మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం గంధసిరి గ్రామంలో కాకతీయుల నాటి శివాలయం పునర్నిర్మాణ పనుల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఎంతగా పెరిగినా ఎలాంటి ఇబ్బంది లేకుండా కరెంటు సరఫరా చేసే వ్యవస్థను నెలకొల్పామని అన్నారు. ఈ రాష్ట్రంలో కరెంటు ఉత్పత్తి చేసింది, రైతులకు ఉచితంగా ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంత త్వరితగతిన ఇల్లు నిర్మించుకుంటే అంత వేగంగా బిల్లులు మంజూరు చేసుకుంటూ పోతామని చెప్పారు. ప్రతి పైసా ప్రజల అవసరాలకు ఖర్చు పెడతామని, ఎట్టి పరిస్థితులలో దోపిడీకి గురి కానివ్వబోమని పేర్కొన్నారు. ప్రజల సొమ్ము దోపిడికి గురైతే అత్యంత ప్రమాదకరమన్నారు. మన బిడ్డల భవిష్యత్తును, మన భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యారంగానికి పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. మహిళలంతా ఆత్మగౌరవంతో బతకాలని వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. ఐదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని చెప్పారు. మధిర నియోజకవర్గంలో 60వేల మంది మహిళా సభ్యులు ఉన్న ఇందిరా మహిళ డెయిరీ దేశానికి తలమానికంగా ఉండబోతోందని వివరించారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించినవారు తాము లేకపోతే ఏమీ ఉండదు, రాష్ట్రం అంధకారమవుతుందన్న విషయాన్ని గుర్తు చేశారు. మధిర నియోజకవర్గ ప్రజలు వేసిన ప్రతి ఓటుకు గౌరవం తీసుకువస్తాను అన్నారు. మధిర ప్రజల ఇంటి బిడ్డగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నెమ్మదింపజేసేందుకు రేపు కుట్ర జరుగుతుంది. మహాగర్ బంధన్ అభ్యర్థులు గెలిస్తే ప్రకటించవద్దని, తొలుత ఎన్డీయే అభ్యర్థుల గెలుపునే ప్రకటించాలని అధికారులకు చెప్పారు. ఈ మేరకు అధికారులకు ఫోన్లు చేశారని తమకు సమాచారం వచ్చింది. క్లియర్ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.
- ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

తెలంగాణ రైతుల పంటలకు అపార నష్టం

- మొంథా తుఫానుతో తీవ్రంగా దెబ్బతిన్నాయి
- నింబంధనలను సడలించి కొనుగోలు చేయాలి
- కేంద్ర మంత్రులకు రాష్ట్ర మంత్రి 'తుమ్మల' వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోలులో ఏర్పడుతున్న సమస్యలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు లేఖల ద్వార కేంద్ర ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మొంథా తుఫాను, అకాల వర్షాలు, అనిశ్చిత వాతావరణం కారణంగా సోయాబీన్, పత్తి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. తెలంగాణ పంటల కొనుగోలుకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం సేకరించే సోయాబీన్, పత్తి పంటల విషయంలో కొన్ని ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, గిరిరాజ సింగ్ కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 3,66,697 ఎకరాలలో సోయాబీన్ సాగైందని, సగటున దిగుబడి ఎకరాకు 7.62 క్వింటాళ్లుగా అంచనా వేశామన్నారు. కోత సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు పడటం వంటి సమస్యల వల్ల నిబంధనలకు అనుగుణంగా పంట రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో సోయాబీన్‌పై ప్రమాణాలను సడలించాలని కేంద్రాన్ని కోరారు. ఆ ప్రకారం నాఫెడ్, ఎన్సీసీఎఫ్ సడలించిన నాణ్యత ప్రమాణాలకనుగుణంగా సోయాబీన్ కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

తొలగించిన ఉద్యోగులను విధులకు తీసుకోవాలి

- ఆర్టీసీ ఎండీకి జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13: బస్ భవన్‌లో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం కలిసారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. 2021 నుంచి ఇప్పటి వరకు చిన్న చిన్న కారణాలతో సుమారు 1,300 మంది డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించిన విషయాన్ని ప్రస్తావించారు. 491 మంది ఉద్యోగులను తిరిగి విధులలోకి తీసుకోవాలని, ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, ఇప్పటి వరకు అమలు కాలేదని అన్నారు. వారిని వెంటనే విధులకు అనుమతించాలని, మిగతా కార్మికుల విషయంలోనూ సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆర్టీసీలో హైర్ బస్సులు, ఎలక్ట్రిక్ బస్సు ప్రవేశపెట్టినప్పటికీ, వాటి డ్రైవర్లపై సంస్థకు నియంత్రణ లేకపోవడంతో భద్రతా సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. శిక్షణ పొందిన డ్రైవర్ల ద్వారానే ఆ బస్సులను నడిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు డ్రైవర్ల వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాగృతి ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖపై కేసు విత్ డ్రా

- కీలక నిర్ణయం తీసుకున్న కింగ్ నాగార్జున

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావా కేసును ప్రముఖ సినీ హీరో నాగార్జున వెనక్కి తీసుకున్నారు. తమ కుటుంబంపై సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వేసిన పరువు నష్టం దావా కేసును ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు. గతంలో నాగచైతన్య సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాగచైతన్యసమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమంటూ ఆరోపణలు చేశారు. తెలంగాణ రాజకీయాలలో ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలపై సీరియస్ అయిన నాగార్జున పరువు నష్టం దావా కేసు వేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. కేసుపై నాంపల్లి స్పెషల్ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. కొండా సురేఖ బహిరంగ క్షమాపణ చెప్పడంతో నాగార్జున కేసును విత్ డ్రా చేసుకున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా అక్కినేని కుటుంబానికి రెండుసార్లు మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పారు.

ఘనంగా బాలల దినోత్సవం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహనీయుడిని స్మరించుకున్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని బాలబాలికలందరికీ సీఎం శుభాకాంక్షలు తెలియజేశారు. బాలలను జాతి సంపదగా భావించి, వారి మెరుగైన భవితవ్యానికి కృషి చేయాలన్న నెహ్రూ ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్న నెహ్రూ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టిందని అన్నారు. చదువుతోనే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమని విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

స్పీకర్ బులెటిన్ రాజ్యాంగ విరుద్ధం

- విచారణ ప్రత్యక్ష ప్రసారం చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : లెజిస్లేటివ్ ట్రిబ్యునల్‌లో స్పీకర్ సమక్షంలో జరుగుతున్న ఫిరాయింపుల విచారణ నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శలు గుప్పించారు. ఆ బులెటిన్ ద్వారా అసెంబ్లీ ప్రాంగణంలోకి మీడియా, సందర్శకులకు ప్రవేశం నిషేధించడంతో పాటు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీలకు కూడా ప్రవేశం నిరాకరించారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీల కార్యాలయాల వరకు మాత్రమే అనుమతి ఇచ్చేలా బులెటిన్‌లో పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. విచారణలో వాదనలు వినిపించనున్న న్యాయవాదులు మొబైల్ ఫోన్లు కూడా తీసుకురావొద్దని ఆదేశించడం సరికాదన్నారు. సుప్రీం కోర్టులో ఫుల్ బెంచ్ విచారణ జరిగినప్పుడు కూడా సెల్ ఫోన్లకు అనుమతిస్తారని, ఇక్కడ మాత్రం గూడుపుఠాణీ నడపాలనుకుంటున్నారని ఆరోపించారు. ఇది స్పీకర్ వ్యక్తిగత నిర్ణయం కాదని, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం జరుగుతున్న వ్యవహారమని అన్నారు. ఆ బులెటిన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని స్పీకర్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్య పారదర్శకత కోసం విచారణను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సింగరేణికి 'స్వచ్ఛత క్యాంపెయిన్' అవార్డు

- సీఎండీ బలరామ్ కు అందజేసిన కేంద్ర మంత్రి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్13: కేంద్ర బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో కోల్ ఇండియా కంపెనీలు, సింగరేణి, ఇతర గనుల సంస్థలలో నిర్వహించిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో సింగరేణి అత్యుత్తమ కంపెనీగా ఎంపికైంది. గురువారం సాయంత్రం కొత్త ఢిల్లీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో సీఎండీ ఎన్. బలరామ్ కు మంత్రి జి. కిషన్ రెడ్డి అవార్డును అందజేశారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో స్పెషల్ క్యాంపెయిన్ 5.0 ను విజయవంతం చేసిన ఉద్యోగులను, అధికారులను అభినందించారు. సింగరేణి సంస్థ బొగ్గు, విద్యుత్ గ్రీన్ ఎనర్జీ వంటి ఉత్పత్తిలోనే కాదు పచ్చదనం, పరిశుభ్రతలో కూడా మంచి పేరు తీసుకురావడం సంతోషకరమని అన్నారు. గాంధీ జయంతి నుండి 30 రోజులపాటు దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల ప్రాంతాలలో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 ను నిర్వహించారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా సింగరేణి సంస్థ అన్ని ఏరియాలలో కార్యాలయాలను, ప్రాంగణాలను పరిశుభ్రపరచడం, అవసరం లేని ఫైళ్లను గుర్తించి వాటిని తొలగించడం వంటి పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, బొగ్గు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పిల్లల

పరీక్ష ఫీజు కట్టనున్న కేంద్ర మంత్రి

- హైదరాబాద్ కలెక్టర్ కు లేఖ రాసిన కిషన్ రెడ్డి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 13 : విద్యార్థుల చదువు, వారికి కనీస సదుపాయాలు కల్పించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి విద్యార్థుల పట్ల తన ఉదారతను చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజు భారం పడకుండా తానే చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు లేఖ రాశారు. ఏ ఒక్క విద్యార్థి కూడా ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనేది తన అభిమతమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి పిల్లలకు సహాయం చేయాలని అనుకుంటున్నానన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని పదో తరగతి విద్యార్థులందరికీ ఫీజును తన జీతం నుంచి చెల్లించాలని నిర్ణయించామన్నారు. పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు.

ఏసీబీ వలలో ఆదిభట్ల టీపీఓ వరప్రసాద్

- 75 వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

ప్రతిపక్షం పతినిధి, రంగారెడ్డి (ఆదిభట్ల), నవంబర్ 13: రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ ఆఫీసులో ఏసీబీ అధికారులు గురువారం సోదాలు జరిపారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వర ప్రసాద్, అసిస్టెంట్ వంశీ ఒక ఇంటి పర్మిషన్ విషయంలో ఆనంద్ అనే వ్యక్తి నుండి 75 వేల రూపాయలు తీసుకుంటుండగా పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఆఫీసులోనూ సోదాలు చేశారు.

సయ్యద్ నివాసంలో విస్తృత తనిఖీలు

- గుజరాత్ ఏటీఎస్ పోలీసుల సోదాలు
- మూడు రకాల లిక్విడ్, కంప్యూటర్, పుస్తకాలు స్వాధీనం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : ఉగ్రవాద ఆరోపణలతో గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేసిన హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ ఇంటిలో అర్ధరాత్రి సోదాలు జరిగాయి. రాజేంద్రనగర్ ఫోర్త్ వ్యూ కాలనీలోని సయ్యద్ నివాసంలో తనిఖీలు జరిపారు. సయ్యద్ సోదరుడు ఓమర్ ఫారుఖీకి నోటీసులు ఇచ్చి మరీ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాలలో మూడు రకాల లిక్విడ్, కంప్యూటర్, పలు రకాల బుక్స్, ఆయిల్ తయారు చేసే మిషన్ సహా పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల బృందం సోదాలలో పాల్గొంది. సోదాలపై టెర్రరిస్ట్ బ్రదర్ ఓమర్ ఫారూఖీ మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లోని తమ ఇంటిలో గతంలో గుజరాత్ ఏటీఎస్ పోలీస్ సోదాలు జరిపారని, తమ ఇంటిలో ఎలాంటి సోదాలు జరగలేవని చెప్పారు. సామాగ్రి సీజ్ చేసి గుజరాత్‌కు వెళ్లిపోయారని తెలిపారు. తన బ్రదర్ టెక్నాలజీ ఏం వాడుతున్నాడు, సోషల్ మీడియాలో యాక్టివ్ ఉన్నాడా? లేడా? అనే విషయం తమకు తెలియదని ఓమర్ ఫారూఖీ పేర్కొన్నారు.

హైదరాబాదులో హై అలర్ట్

- నగరమంతటా విస్తృత సోదాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13 : మహా నగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాలను కేంద్రం అప్రమత్తం చేసింది. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. సికింద్రాబాద్ స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. మతపర ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు ఎక్కడ కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోటల్స్‌పై నిఘా పెంచారు. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం కలకలం రేపుతోంది. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

విమానాశ్రయాలలో భద్రత రెట్టింపు

- తనిఖీ చేశాకే ప్రయాణికుల లగేజీకి అనుమతి
- విమాన సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 13 : రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతను రెట్టింపు చేశారు. ప్రయాణికుల లగేజీని విస్తృత తనిఖీల తర్వాతనే అనుమతిస్తున్నారు. ముఖ్యంగా రసాయన పదార్థాలపై డేగ కండ్ల నిఘా పెట్టారు. ఎర్ర కోట సమీపంలోని పేలుడు దుర్ఘటన దేశం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. ఈ తరహా దాడులు మరెక్కడా చోటుచేసుకోకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. దేశంలోని ప్రముఖ నగరాలలో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రజా రవాణా వ్యవస్థల మీద దృష్టి పెట్టింది. విమానాశ్రయాలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. దేశవ్యాప్తంగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలకు కేంద్ర పౌర విమానయాన భద్రతా విభాగం మార్గదర్శకాలు జారీ చేసింది. విమానాలలో భద్రతను పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఉగ్ర చర్యలకు పాల్పడే వ్యక్తులు హానికర రసాయన పదార్థాలు, విషపూరిత వస్తువులు, ఐఈడీ వంటి పేలుడు పదార్థాలను వేర్వేరుగా తరలించే అవకాశాలున్నాయని తెలిపింది. అనుమాదస్పద, అపరిచిత వ్యక్తులు వస్తువులు కనిపించినా ప్రయాణికులు వెంటనే విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపింది. అత్యంత రద్దీ కలిగిన ప్రధాన విమాశ్రయాల వద్ద మరింత కట్టుదిట్టం చేయాలని తెలిపింది.

దివ్యాంగుల పెన్షన్ కోసం సదరం స్లాట్ బుకింగ్ రేపట్నుంచి ప్రారంభమవుతుంది. ఇప్పటికే స్లాట్ బుకింగ్ చేసుకున్న 10వేల మందికి తొలి ప్రాధాన్యమిస్తాం. దివ్యాంగుల ఆర్థికస్థితిని పరిగణనలోకి తీసుకొని స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ ముద్రణకు గతంలో ₹40 చొప్పన ఉన్న ఫీజును ఇప్పుడు రద్దు చేశాం.

- ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఓపెన్ వాయిస్

సరిహద్దులో పెద్ద పులుల కలకలం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దులలో పెద్దపులుల సంచారం అలజడి కలకలం రేపుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులోని తిప్పేశ్వర్ పులుల అభయారణ్యం నుండి పెన్ గంగానదీ తీరం దాటి తెలంగాణ సరిహద్దు దాటి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తూ రైతులలో వణుకు పుట్టిస్తున్నాయి. అటు కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దులలో తడోబా అభయారణ్యం నుండి జిల్లాలోకి పులులు సంచరిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఇక్కడే తిష్టవేసి పశువులు, మేకల గుంపులపై దాడి చేసి హతమారుస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం ఆదిలాబాద్ భీంపూర్ మండలంలోని సరిహద్దు గ్రామాలలో పత్తి చేనులో పులి కనిపించింది. కొందరు రైతులు ధైర్యంగా సెల్ ఫోన్ లో ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. పరిసర ప్రాంతాలలో పులి కదలికలతో పత్తి ఏరే రైతులు కూలీలు భయాందోళనకు గురయ్యారు. పొలాలలో రైతులు టపాసులు కాల్చి మరీ పనులు చేస్తున్నారు. అక్కడ నుంచి వెళ్లిన పులి సరిహద్దులో గల బోథ్ మండలం నిగిని, కంటెగాం, రఘునాథ్ పూర్, అజ్జర్, వజ్జర్, చింతల్ బోరి, డేడ్రా అటవీ శివారు గ్రామాలలో సంచరిస్తోంది. పెద్దపులి అలికిడికి గ్రామాలన్ని వణికిపోతున్నాయి. సరిహద్దు మహారాష్ట్రలోని చికిలి, శివిని, డాంకి, ఈసాపూర్, ఘన్ పూర్ మీదుగా ఓ ఆడపులి సంచరిస్తూ అక్కడి రైతులలో హడలెత్తిస్తుంది. అయితే, ఆవులు, గేదెలు, మేకలను ఈ పెద్దపులి వేటాడి చంపినప్పుడే పులి జాడ బయటపడుతోంది. సామాన్య ప్రజలు, రైతులు పత్తి పంట చేనులోకి వెళ్లి పలు సందర్భాలలో పెద్దపులిని చూసి భీతిల్లిపోవడం, అటవీ అధికారులకు సమాచారం అందించడం జరుగుతుంది. ఇదివరకే సరిహద్దులోని కంటెగాం, రఘునాథ్ పూర్, నిగిని ప్రాంతాలలో అటవీ సిబ్బంది పెద్దపులి కదలికలపై అన్వేషణ సాగిస్తూ పాదముద్రలు సేకరిస్తున్నారు. ట్రాప్ కెమెరాలను పెట్టి పులి కదలికలపై నిఘా పెంచారు. రైతులు మాత్రం ఉదయం సాయంత్రం పంట చేలకు వెళ్లవద్దని, పగలు వెలుతురున్నప్పుడు గుంపులు గుంపులుగా వెళ్లాలని, పెద్దపులి కనిపిస్తే అరుపులు కేకలతో హడావుడి చేయాలని అటవీ అధికారులు సూచిస్తున్నారు. ఈ విషయమై బోథ్ అటవీశాఖ రేంజ్ అధికారి ప్రణయ్ పులి సంచారం వాస్తవమేనన్నారు. యేటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాలలో ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో పెద్దపులి సంచరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మాసాలలోనే మేటింగ్ కోసం అనువైన వాతావరణం ఉంటుందన్నారు. పులి ఆవాసం కోసం ఈ ప్రాంతానికి తరచూ వస్తూ పోవడం ఈ కాలంలో షరా మాములేనని, వ్యవసాయ పనులలో ఉండే కూలీలు, రైతులు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పనులు చేసుకుని వెళ్లాలని పులికి ఎలాంటి హాని చేయకూడదని అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అయితే, బోథ్ మండల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆడపులి జిల్లాలోని భీంపూర్ మండల సరిహద్దులలోనీ అటవీ ప్రాంతంలో మగపులి కదలికలు మేటింగ్ కోసమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఆవాసానికి అనువైన ప్రదేశం కావడంతో తిప్పేశ్వర్ అభయారణ్యం దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయన్నాయి. ఇటీవల భీంపూర్ మండలంలోని తాంసి (కె) గ్రామ శివారులో గొంటి ముక్కల అశోక్ పత్తి చేనులో పెద్దపులిని చూసి పరుగు పరుగున గ్రామానికి చేరుకున్నారు. పులి కదలికలను పసిగట్టి సెల్ ఫోన్ లో చిత్రీకరించారు. తాంసి (కె)గొల్లఘాట్, అర్లి, భగవాన్ పూర్ వడగాం, సరిహద్దు గ్రామాలలో మగపులి సంచరిస్తుంది. పత్తి, సోయాబిన్ పంట చేతికి రానున్న దశలో చేనుకు వెళ్లాలంటేనే భయంతో వణికిపోతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాలలో ఆవాసం అనువుగా ఉండటం, వణ్య ప్రాణుల సంఖ్య పెరుగడంతో పెద్దపులుల రాకపోకలు ఈ ప్రాంతాలలో పెరిగిపోయాయి. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికల్ పేట్, కౌటాల, దహెగాం, కాగజ్ నగర్ అటవీ ప్రాంతాలలోనూ పెద్ద పులులు సంచరిస్తున్నాయి. పులులు సంచరించే ప్రాంతాలలో అటవీశాఖ అధికారులు పాదముద్రలను సేకరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేస్తూ రైతులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాలలో డప్పు చాటింపు సైతం నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

హైదరాబాద్

శుక్రవారం
14.11.2025

నేటి బాలలే రేపటి భారత భవిష్యత్తు

ప్రభుత్వం, సమాజం, తల్లిదండ్రులు కలిసి పిల్లల విద్య, ఆరోగ్యంపై దృష్టి సారించాలి. ప్రతి కుటుంబం పిల్లల వాక్సినేషన్ పూర్తి చేయాలి. విద్యను ప్రాధాన్యంగా తీసుకోవాలి. ప్రభుత్వాలు విద్య, ఆరోగ్య రంగాల కోసం చిత్తశుద్ధితో నిధులు కేటాయించాలి. సమాజంలోని ప్రతి పౌరుడు సంవత్సరంలో కనీసం ఒకరోజు తన సంపాదనలో భాగాన్ని పిల్లల సంక్షేమానికి విరాళంగా ఇవ్వాలి. నేటి బాలలే రేపటి పౌరులు, నవభారత నిర్మాతలు. వారి నవ్వు ప్రపంచానికే ఆనందం. వారి భవిష్యత్తు మన చేతులలో ఉంది. ప్రేమతో, విద్యతో, విలువలతో వారిని తీర్చిదిద్దుదాం.

వేల్పుల మహేందర్
9912775834

ప్రతి సంవత్సరం నవంబర్ 14న భారతదేశం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుంది. ఇది భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా జరుపుకునే ప్రత్యేక దినం. పిల్లల పట్ల నెహ్రూ చూపిన అపారమైన ప్రేమ, మమకారం, అభిమానం కారణంగా ఆయనను అందరూ 'చాచా నెహ్రూ' అని ప్రేమగా పిలుస్తారు. ఆయన నమ్మకం ప్రకారం పిల్లలే దేశానికి నిజమైన సంపద, దేశ భవిష్యత్తు నిర్మాణకర్తలు. నెహ్రూ తరచూ 'పిల్లలు ఉద్యానవనంలో మొగ్గలు లాంటివారు, వారే జాతి భవిష్యత్తు. నేటి పిల్లలే రేపటి పౌరులు. వారిని ప్రేమతో, జాగ్రత్తగా పెంచుకోవాలి' అని చెప్పేవారు. పిల్లల హక్కులు, విద్య, సంక్షేమం కోసం ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారు. అందుకే ఆయన జన్మదినాన్ని దేశం మొత్తం బాలల దినోత్సవంగా జరుపుకుంటుంది.

బాలల దినోత్సవం ఆరంభం

1954లో ఐక్యరాజ్యసమితి బాలల దినోత్సవాన్ని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్యం, రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించడమే దీని లక్ష్యం. 1964 వరకు భారతదేశంలో నవంబర్ 20న బాలల దినోత్సవం జరుపుకునేవారు. నెహ్రూ మరణానంతరం ఆయన పుట్టినరోజు నవంబర్ 14న ఈ దినోత్సవాన్ని జరపాలని భారత పార్లమెంట్ తీర్మానించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 14న దేశవ్యాప్తంగా బాలల దినోత్సవం జరుగుతోంది. ఈ రోజు కేవలం పండుగ కాదు. ఇది పిల్లల పట్ల ప్రేమ, గౌరవం, బాధ్యతలను గుర్తు చేసే రోజు. ప్రతి బాలుడు విద్య, ఆరోగ్యం, భద్రత పొందే హక్కు కలిగివున్నాడని మనందరికీ గుర్తుచేసే సందర్భం. పిల్లలు సమాజానికి 'అత్యంత విలువైన వనరు' అని నెహ్రూ చెప్పినట్లుగా, ఈ దినం దేశ భవిష్యత్తు పట్ల మన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా బాలల హక్కుల గుర్తింపునకు 1959లో ఐరాస సర్వసభ్య సభ 'బాలల హక్కుల ప్రకటన' ఆమోదించింది. అనంతరం 1989లో 'బాలల హక్కులపై ఒప్పందం' 191 దేశాలు ఆమోదించాయి. దీంతో పిల్లల రక్షణ, పోషణ, విద్యపై అంతర్జాతీయ దృష్టి మరింతగా పెరిగింది.

నేడు మన ముదున్న సవాళ్లు

వేగంగా మారుతున్న ప్రపంచంలో పిల్లల సంక్షేమం అత్యవసర అంశంగా మారింది. భారత రాజ్యాంగం ప్రకారం 6 నుండి 14 యేండ్ల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్య హామీ ఇచ్చినప్పటికీ, ఇంకా అనేక మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. పేదరికం, సామాజిక వివక్ష, మౌలిక సదుపాయాల లేమి, కుటుంబ మద్దతు లోపం వంటి అంశాలు విద్యలో ప్రధాన అవరోధాలుగా మారాయి. పిల్లల విద్యలో ఆర్థిక అడ్డంకులు మాత్రమే కాక, ఆరోగ్య సమస్యలు కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పోషకాహార లోపం, రక్తహీనత, శుద్ధజలాల కొరత వంటి సమస్యలు పిల్లల పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

తెలంగాణలో బాలల పరిస్థితి

తెలంగాణ రాష్ట్రంలో బాలల పరిస్థితి ఇంకా సవాళ్లతోనే నిండివుంది. బాలికల విద్యలో మధ్య తరగతుల వద్ద చేర్పులు తగ్గడం, హయ్యర్ సెకండరీ స్థాయిలో చేరికలు తగ్గడం ఆందోళన కలిగిస్తున్న అంశాలు. అదనంగా బాల్యవివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు ఇంకా కొనసాగుతున్నాయి. పోషకాహార లోపం, రక్తహీనత, శిశు మరణాలు వంటి సమస్యలు ఇంకా పరిష్కారం కావాలి. 15-19 సంవత్సరాల మహిళలలో రక్తహీనత అధికంగా ఉంది. అనాథ పిల్లలు, బాలకార్మికుల పరిస్థితి కూడా దిగ్భ్రాంతికరంగా ఉంది. ప్రభుత్వం బాలల రక్షణ కోసం పీడిత బాలల కోర్టులు (పోక్సో), కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సర్వ శిక్షాభియాన్ వంటి పథకాలతో కృషి చేస్తోంది. అయినా, సమాజం లోని ప్రతి వర్గం చైతన్యంతో ముందుకు రాకపోతే, ఈ సమస్యలు పూర్తిగా తీరవు. భారతదేశంలో బాల కార్మికుల సమస్య ఇంకా పరిష్కారం కాని సామాజిక దురవస్థగా ఉంది. 'ఇంటర్నేషనల్ సెంటర్ ఆన్ లేబర్' నివేదిక ప్రకారం దేశంలో 25 నుండి 30 మిలియన్ వరకు బాల కార్మికులు ఉన్నారు. వారిలో చాలామంది పాఠశాలలకు వెళ్లడం లేదు. పేదరికం, తల్లిదండ్రుల నిర్లక్ష్యం, అనాథ స్థితి, అక్రమ రవాణా వ్యాపారాలు ఈ సమస్యకు ప్రధాన కారణాలు.

ప్రమాదకర పరిశ్రమలలో పిల్లలు

1986లో 'బాల కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం' అమలు చేసినప్పటికీ, ఇది పూర్తిగా ఫలితం ఇవ్వలేకపోయింది. ఈ చట్టం కింద ప్రమాదకర పరిశ్రమలలో పిల్లల పని నిషేధించబడింది. 1987లో బాల కార్మికుల నిర్మూలనకు జాతీయ విధానం రూపొందించబడింది. అలాగే సర్వ శిక్షా అభియాన్, జాతీయ బాల కార్మిక పథకాలు కూడా అమలులో ఉన్నాయి. కానీ, చట్టాలు ఒక్కటే సరిపోవు. సమాజం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి బాల కార్మికత్వానికి వ్యతిరేకంగా చైతన్యంతో పోరాడాలి. 'చిన్న చిన్న చేతులు పుస్తకాలు పట్టాలి, పనిముట్లు కాదు' అనే నినాదం కేవలం మాట కాకుండా జీవన విధానంగా మారాలి. 18 సంవత్సరాల లోపు ప్రతి బాలుడికి సమానత్వ హక్కు, విద్యా హక్కు, ఆరోగ్య హక్కు, రక్షణ హక్కు, అభిప్రాయ స్వేచ్ఛ హక్కులు ఉన్నాయి. పిల్లలను అక్రమ రవాణా చేయడం, వ్యభిచార వృత్తిలో దించడం, జీతాలకు పెట్టడం నేరం. ప్రతి పిల్లవాడి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, వారిని వినడం సమాజపు బాధ్యత. దేశంలో పుట్టిన 12 మిలియన్ బాలికలలో మూడు మిలియన్ తమ 15వ పుట్టిన రోజు చూసే లోపే మరణిస్తున్నారు. పోషకాహార లోపం, రక్తహీనత, తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా పిల్లల ఆరోగ్య పరిస్థితి దిగజారింది. రెండు సంవత్సరాల లోపు ఉన్న పిల్లలలో 58 శాతం మందికి పూర్తిగా టీకాలు ఇవ్వడం లేదు. వ్యాపార లైంగిక వృత్తిలో 40 శాతం మంది బాల బాలికలే ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి.

మన బాధ్యత

ప్రభుత్వం, సమాజం, తల్లిదండ్రులు కలిసి పిల్లల విద్య, ఆరోగ్యంపై దృష్టి సారించాలి. ప్రతి కుటుంబం పిల్లల వాక్సినేషన్ పూర్తి చేయాలి. విద్యను ప్రాధాన్యంగా తీసుకోవాలి. ప్రభుత్వాలు విద్య, ఆరోగ్య రంగాల కోసం చిత్తశుద్ధితో నిధులు కేటాయించాలి. సమాజంలోని ప్రతి పౌరుడు సంవత్సరంలో కనీసం ఒకరోజు తన సంపాదనలో భాగాన్ని పిల్లల సంక్షేమానికి విరాళంగా ఇవ్వాలి. నేటి బాలలే రేపటి పౌరులు, నవభారత నిర్మాతలు. వారి నవ్వు ప్రపంచానికే ఆనందం. వారి భవిష్యత్తు మన చేతులలో ఉంది. ప్రేమతో, విద్యతో, విలువలతో వారిని తీర్చిదిద్దుదాం.

(నేడు బాలల దినోత్సవం, చాచా నెహ్రూ జయంతి)

(వ్యాస రచయిత లెక్చరర్,
కింగ్ స్టన్ కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్)

ఢిల్లీ పేలుళ్లకు కారకులెవరు?!

ఎండీ ఉస్మాన్ ఖాన్
99125 80645

ఢిల్లీలో ఇటీవల సంభవించిన పేలుళ్లు దేశాన్ని మరోసారి వణికించాయి. ఈ దుర్ఘటనలో మొత్తం పదమూడు మంది నిరపరాధులు ప్రాణాలు కోల్పోయారు. ఢిల్లీ ఎర్రకోట పరిసరాలు ఆర్తనాదాలతో నిండిపోయాయి. ఆ భయానక దృశ్యాలు కేవలం దుఃఖాన్ని మాత్రమే కాదు. మన సమాజం ఎంత అస్థిరంగా మారిపోయిందో, విలువలు ఎంతగా దిగజారిపోయాయో గుర్తు చేస్తున్నాయి. ఈ దుర్మార్గానికి పాల్పడినవారు అజ్ఞానులు కాదు, విద్యావంతులు, వైద్యులు అన్న సమాచారమే ఆందోళనకరమైన విషయం. చదువు మానవతను నేర్పాలి, కానీ, ఇక్కడ చదువు చీకటిలోకి నడిపించింది. మూర్ఖత్వంలోకి నెట్టివేసింది. ప్రాణాలు కాపాడే వృత్తిలో ఉన్నవారు ప్రాణాలను తీసే స్థితికి ఎలా వచ్చారు! విద్య, స్థాయి, గుర్తింపు ఇవి ఎటు వైపుకు తీసుకువెళుతున్నాయి? దీని వెనుక ఏ శక్తులు పని చేస్తున్నాయి. ఇవన్నీ కూడా తీవ్రంగా ఆలోచించవలసిన విషయాలు. ఇది కేవలం ఒక నేరం కాదు, నైతిక వైఫల్యానికి ప్రతీక. విద్య, జ్ఞానం ఉన్నవాడే సంస్కారవంతుడవుతాడనేది ఒక అపోహ. ఉన్నత విద్యావంతులు కూడా అహంకారం, అసహనం, హింస, మతోన్మాదంలో మునిగిపోయి ఉగ్రవాద చర్యలకు పాల్పడిన సందర్భాలు చరిత్రలో మనకు కనిపిస్తాయి. మహాత్మా గాంధీని దారుణంగా కాల్చిచంపిన ఆర్ఎస్ఎస్ నాయకుడు నాథూరాం గాడ్సే కూడా ఒక ఉన్నత విద్యావంతుడు, రెండు పత్రికలకు సంపాదకుడుగా పనిచేశాడు. మతోన్మాదం తలకెక్కడంవల్ల, ఆలోచనలో మానవత్వం లేకపోవడం వల్ల ఆ విద్య అంతా వినాశనానికి దారి తీసింది. అదే పరిస్థితి మళ్లీ ఇప్పుడు చూస్తున్నాం. డాక్టర్లు, ఇంజనీర్లు, టెక్నికల్ విద్యావంతులు కూడా తప్పుడు మార్గంలో పయనిస్తున్నారు.

విద్య కేవలం డిగ్రీలలో కాకుండా

అందుకే విద్య కేవలం డిగ్రీలలో కాకుండా, మనిషి మనసులో మానవీయ విలువలు ప్రోది చేసేదిగా ఉండాలి. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారు పూర్తిగా అమాయకులు. రకరకాల పనుల నిమిత్తం బయటికి వచ్చినవారు, దారిలో ఉన్నారు. అసలు వారి తప్పేముంది? ప్రతి పేలుడు వెనుక ఒక జీవితం, నాశనమైన కుటుంబం, పగిలిపోయిన కల ఉన్నాయి. మనం '13 మంది' చనిపోయారని సంఖ్యను లెక్కిస్తాం. కానీ, అక్కడ మరణించింది మానవత్వం. ఈ దుశ్చర్యలకు పాల్పడినవారు ఎవరు? వారు ఎవరి నుండి ప్రభావితమయ్యారు? ఏ సంస్థలు, సంఘాలు వీరిని పక్కదారి పట్టించాయి? వీరి లక్ష్యం ఏమిటి? అమాయకులను బలిగొని వీరు సాధించేదేమిటి? ఈ అంశాలపై లోతుగా, పారదర్శక దర్యాప్తు జరగాలి. మూలాలను అన్వేషించి, వాటిని తుదముట్టించకపోతే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూనే ఉంటాయి. ఇక్కడ విషయం ఏమిటంటే, బిహార్ ఎన్నికల వేళ జరిగిన ఈ పేలుళ్లు యాదృచ్ఛికం కాదనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజలలో భయం, గందరగోళం, అవిశ్వాసం సృష్టించే ఇలాంటి ఘటనలు సాధారణంగా రాజకీయ వాతావరణాన్ని మార్చడానికి ప్రయత్నిస్తాయి. ఎన్నికల సమయాలలో 'భద్రత' అనే అంశం చర్చకు రావడం కొందరికి అనుకూలంగా మారుతుంది అన్నది గత అనుభవం చెబుతోంది.

ఈ దాడి వెనుక ఉద్దేశ్యం

ఇదే కారణంగా ఈ దాడి వెనుక ఉద్దేశ్యం కేవలం ఉగ్రవాదమా, లేక రాజకీయ కూడికలూ, తీసివేతలపై ప్రభావం చూపించడమా అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. ఎన్నికల వేళ జరిగే ప్రతి సంఘటన, ప్రతి ప్రాణనష్టం రాజకీయ లాభనష్టాల చర్చగా మారిపోవడం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకర ధోరణి. ఈ పరిస్థితి మన వ్యవస్థ ఎక్కడ బలహీనపడిందో చూపిస్తోంది. మనం విద్యను కేవలం మార్కులకే పరిమితం చేశాం. మన పిల్లలకు మనిషిగా ఎలా ఉండాలో, శాంతి అంటే ఏమిటో చెప్పాలి, భిన్నత అంటే శత్రుత్వం కాదని నేర్పించాలి. మతం, జాతి, భాష ఆధారంగా విభజించే రాజకీయాలనూ, మీడియా వివక్షనూ నిలువరించకపోతే, రేపు మరో విద్యావంతుడు దారితప్పే అవకాశం ఉంటుంది. ప్రతి దుర్ఘటన తర్వాత మనం కొద్ది రోజులు బాధపడతాం. తర్వాత మరచిపోతాం.

కానీ నిర్లిప్తత కూడా నేరమే కదా?

ఒకడు ప్రాణాలు తీస్తే, మరొకడు మౌనం వహించకూడదు. మనకెందుకులే అని వదిలేయడంకూడా బాధ్యతా రాహిత్యమే అవుతుంది. కనుక మౌనం వీడాలి, న్యాయం కోసం, మానవత్వం కోసం, మన భవిష్యత్తు కోసం మాట్లాడాలి. మనం మాట్లాడినంత మాత్రాన దుర్మార్గాలు ఆగిపోతాయని కాదు, కానీ ఇలాంటి దుశ్చర్యల నిర్మూలనలో మనందరి పాత్ర కూడా ఎంతో కీలకం. మరో విషయం ఏమిటంటే, నేరస్తులు ఒక మతానికి చెందిన వారనే అనుమానంతో మొత్తం సమాజాన్ని నిందించకూడదు. ఎందుకంటే, అక్కడ చనిపోయినవారిలో ఒకరు, తీవ్రంగా గాయపడినవారిలో ఐదుగురు ముస్లింలు ఉన్నారు. కనుక ఇలాంటి సందర్భాలలో కులాల, మతాల ప్రస్తావన ఉండకూడదు. ఇలాంటి దుర్మార్గులు అన్ని మతాలు, అన్ని కులాలు, అన్ని వర్గాలలో ఉంటారు. ఇలాంటి అనేక ఉదాహరణలు మన ముందున్నాయి. కనుక ఒక మతం లేదా ఒక కమ్యూనిటీని మనం విమర్శించడం సమంజసం కాదు, సమాధానమూ కాదు. భాష, వేషం మతాలకు ప్రాతినిధ్యం వహించవు. ఇది చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన విషయం. ఇతరులను ఏకపక్షంగా నిందించడం, పక్షపాత వైఖరి అవలంబించడం జరగకూడదు. దీనివల్ల సాధారణ ప్రజలు అవమానాలకు గురై, అనుమానపు చూపులకు బలైపోతారు.

మానవత్వానికి అవమానం

ఢిల్లీ పేలుళ్లను మతపరంగా ముడిపెట్టే ప్రయత్నం మానవత్వానికి అవమానం. ఉగ్రవాదానికి మతం లేదు, మతానికి ఉగ్రవాదం లేదు. ఈ ఘటనను ఇస్లాం పేరుతో కలిపి ప్రచారం చేయడం దురుద్దేశపూరితం. వాస్తవానికి, ముస్లిం నాయకులు, మతపెద్దలు, సాధారణ పౌరులు కూడా ఈ అమానుష చర్యను తీవ్రంగా ఖండించారు. నిరపరాధిని హతమార్చడం యావత్తు మానవాళిని హత మార్చినట్లేనని చెప్పిన ఇస్లామీయ సూత్రాన్ని వారు మళ్లీ గుర్తు చేశారు. ఈ దాడి వెనుక ఎవరున్నా, ఏ మతం లేదా ప్రాంతానికి చెందినవారైనా, నేరస్తులుగానే చూడాలి, నిందితులుగా కాదు. బాధితుల కుటుంబాలను ఆదుకోవడం, గాయపడిన వారికి సరైన వైద్యం, సహాయం అందించడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. కానీ అంతకన్నా ముఖ్యం, ఈ సంఘటనను విభజనకు ఆయుధంగా మార్చకుండా, సమాజంలో మతసామరస్యాన్ని బలపరచాలి. ఇలాచేస్తేనే ఉగ్రవాదం నిజంగా ఓడిపోతుంది. ఏది ఏమైనా, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి ఖచ్చితమైన న్యాయపద్ధతిలో కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబాలకు తప్పనిసరిగా న్యాయం జరగాలి.

(వ్యాస రచయిత సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

పల్లె పాలన ఊసే లేదు

అంబీర్ శ్రీకాంత్
81859 68059

'జయంతికీ, వర్ధంతికీ పూల మాలలు, మహాత్ముల బాటకు ముళ్ల కంచెలు' అని ఓ కవి అన్నది మన కండ్ల ముందు జరుగుతున్న వాస్తవమే. 'దేశానికి పల్లెలు పట్టుగొమ్మలని' అన్నారు ఒక మహానుభావుడు. కానీ, నేడు తెలంగాణ పల్లెలను గాలికి వదిలేశారు పాలకులు. కనీసంగా వాటి సంగతి ఎలా? అనే ఊసే ఎత్తడం లేదంటే ఎంతటి చిత్తశుద్ధితో పని చేస్తున్నారో స్పష్టమౌతుంది. రాజకీయం చేయడంపైన పెట్టిన శ్రద్ధ స్థానిక సంస్థల ఎన్నికలపైన పెట్టడం లేదు. 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టుగా అన్ని రాజకీయ పార్టీలు ఎలక్షన్స్‌లో గెలుపునకు ప్రణాళికలు రచించుకుంటున్నారు. కానీ, ఎన్నికలు వీలయినంత త్వరగా నిర్వహించి పల్లె పాలన వ్యవస్థను గాడిన పెట్టాలని చిత్తశుద్ధితో అయితే అడగడం లేదు. 73వ భారత రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసే ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ చేపట్టాలి. లేని పక్షంలో పాలకవర్గాల గడువు ముగిసిన ఆరు నెలలలో కొత్త పాలకవర్గాలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్రంలో గ్రామ పంచాయతీల గడువు ముగిసి యేదాది దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాలనా వ్యవస్థ పట్టుతప్పుతోంది. గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది.

ప్రత్యేక అధికారుల పరిపాలన

2024 ఫిబ్రవరి మొదటి వారంలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. మండలస్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఒక్కో అధికారికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. వారి శాఖలకు సంబంధించిన విధి నిర్వహణలపైనే ఆ ఆఫీసర్లు దృష్టి సారిస్తుండటంతో పంచాయతీల పాలన పట్టాలు తప్పింది. ఇక గత సుమారు 20 నెలలుగా గ్రామపంచాయతీలలో పాలకవర్గాలు లేకపోవడంతో స్థానిక సమస్యలు పరిష్కారం కాక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు, జడ్పీటీసీలు, మండల పరిషత్ పాలక వర్గాలు కూడా ఖాళీగానే ఉన్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి, 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన గ్రాంట్లు, నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులు ఆగిపోయి ప్రజలకు మౌలిక వసతులు అందడం లేదు. తాగునీరు, పారిశుధ్యం, సీసీ రోడ్లు వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో అర్థం కాని స్థితిలో ఉన్నారు. పంచాయతీ

కార్యదర్శులపైన విపరీతమైన భారం పడుతోంది. ఏ చిన్న సమస్య వచ్చినా తమనే బాధ్యులను చేస్తున్నారని వాపోతున్నారు. రోజూ పలు పనులకు సంబంధించి ఆన్‌లైన్ సమాచారం అందజేత, మండల అధికారులకు నివేదికల సమర్పణతోనే తమ కాలం గడిచిపోతోందని భారమవుతోందని చెబుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేదాది దాటినా స్థానిక సంస్థల ఎన్నికలపై ఇంతవరకు స్పష్టత ఇవ్వక పోవడంతో గ్రామీణాభివృద్ధిపై పాలకులకు ధ్యాసే లేదని అనిపిస్తుంది. కనీసంగా ఆ ఊసును ఎత్తే ప్రయత్నం చేయకుండా రిజర్వేషన్ల పంచాయితీ ముందర పెట్టుకుని ప్రతీసారి ఎన్నికలను వాయిదా వేయడం సమంజసం కాదని అనిపిస్తోంది. గ్రామ పాలన పటిష్టంగా ఉంటేనే ఆటోమేటిక్‌గా రాష్ట్ర పురోగతి, అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములవుతారని పాలకులు గుర్తెరగాలి.

(వ్యాస రచయిత సీనియర జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

ఘనంగా గోదావరికి మహా హారతి

- నదీమ తల్లికి వైభవోపేతంగా పూజలు

ప్రతిపక్షం, గోదావరిఖని, నవంబర్ 13: గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా గోదావరికి మహా హారతి నిర్వహించారు. సమ్మక్కసారలమ్మ జాతర స్థలంలో వేద బ్రాహ్మణులు మహా హారతి ఇచ్చారు. పరమశివుని అభిషేకం, నదీ పూజా కార్యక్రమాల అనంతరం గోదావరి తల్లిని పులకరింపచేసేలా, కూచిపూడి భరత నాట్యాలతో, వైవిధ్యభరితంగా వివిధ రకాల హారతులను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వందలాది మంది భక్తులతో మహా హారతి కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ గోదావరి సామాజిక ఆధ్యాత్మిక, ఆర్థిక ప్రగతికి తోడ్పాటును అందించిందన్నారు. పూర్వం విద్యాలయాలతో వైభవోపేతంగా విలసిల్లిన ప్రాంతమని, ఋషులు మహర్షులు తపస్సు నాచరించిన ప్రాంతమని అన్నారు. సీతారామచంద్రుల వారు వనవాస సమయంలో పర్యటించిన పుణ్యభూమి అన్నారు. నదీ తీర ప్రాంతంలోని ప్రాచీన దేవాలయాలను అభివృద్ధి లోకి తీసుకురావాలని సత్సంకల్పంతో గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని 2012లో ప్రారంభించి ఇప్పటి వరకు నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. సకల జీవకోటికి జీవనాధారమైన నదీ జలాలను కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. కూచిపూడి నృత్య కళాకారిణి ఉజ్వల శిష్య బృందం ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ లక్ష్మీవాణి, చార్టెడ్ అకౌంటెంట్ సత్యనారాయణ గౌడ్, మోతీపాటి ఆనంద్, డా. రమ్య చిరంజీవి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఉత్సవ సమితి ప్రతినిధులు తాటిపల్లి వెంకన్న, పల్లెర్ల చంద్రమౌళి, గందెశ్రీ భవాని, వీరేశం, గుండా మంజుల, అంశాల వీరేశం, తణుకు మంజుల, నగునూరి అంజలి,గుండా రమేష్, శైలజ,మంగళ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు నేడే

ప్రతిపక్షం,సిటి బ్యూరో,నవంబర్ 14: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు నేడు (శుక్రవారం) ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,08,561, మహిళలు 1,92,779, మరియు ఇతర లింగాలకు చెందిన ఓటర్లు 25 మంది ఉన్నారు. ఇటీవలి పోలింగ్‌లో మొత్తం 1,94,631 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 99,771, మహిళలు 94,855, ఇతరులు 5 మంది ఓటేశారు. మొత్తం పోలింగ్ శాతం 48.49%గా నమోదైంది. లెక్కింపు కోసం 42 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 10 రౌండ్లలో లెక్కింపు జరుగనుంది. లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమై, ఫలితాలు మధ్యాహ్నం నాటికి వెలువడే అవకాశం ఉంది.కోట్ల విజయ భాస్కర్ స్టేడియంలో మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 144 సెక్షన్ అమలు చేశారు. మద్యం షాపులు బంద్, ర్యాలీలు నిషేధం అమలులో ఉంటాయి.

దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 13. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులు తమ ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కేంద్రాల ద్వారా విక్రయించవచ్చని మేడ్చల్ శాసనసభ్యులు మల్లారెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని శామీర్‌పేట్ , అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని జగన్‌గూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్‌పేట్ సిసైటీ ఛైర్మెన్ మధుకర్ రెడ్డి, వైస్ ఛైర్మెన్ మేకల ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జిడిపల్లి వేణుగోపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు,అధికారులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

ప్రతిపక్షం, ఉప్పల్ / సిటీబ్యూరో, నవంబర్ 13 : మల్లాపూర్ సర్వే నెం 110 లోని 300 గజాల ప్రభుత్వ స్థలం, 1996 లో అప్పటి ప్రభుత్వం ఆదేశాల మేరకు, అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నవోదయ మహిళ మండలికి కేటాయించిన స్థలంలో అప్పటి కాప్రా మున్సిపాలిటీ వారు శాశ్వత భవనం నిర్మించడం జరిగింది.సదరు స్థలంలో భవన నిర్మాణం చేసిన తరువాత మిగిలిన ఖాళీ స్థలానికి ప్రహరీ గోడ శంకుస్థాపన చేశారు. కాని ఇట్టి స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో అట్టి స్థలాన్ని కబ్జాలను నుండి కాపాడి. ప్రజలకు ఉపయోగ పడే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఐఎఎస్ కు వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి గారు, పి జి సుదర్శన్, రాజేష్, గున్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజంలదరికీ గూడు,నీడ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 13 : పేద ప్రజంలదరికీ గూడు,నీడ కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ రాజ్యంలో పేదవారి సొంతింటి కల నెరవేరబోతుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ అన్నారు.మండల పరిధిలోని ఎత్బార్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి ఆయన హాజరైయ్యారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్లతో పేద ప్రజల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ప్రభుత్వ తోడ్పాటును అందిపుచ్చుకుని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్,మండల అధ్యక్షులు మాణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలమిత్ర అవార్డుల ప్రదానం

- బాలల హక్కుల వేదిక అధ్యక్షుడు వలస సుభాస్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 13: బాలల దినోత్సవ సందర్భంగా రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం శుక్రవారం నాడు రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నట్టు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. బాలబాలికలలో నైపుణ్యాలు వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు వారిలో దాగివున్న సృజనాత్మ శక్తి పెంచేందుకు దోదపడుతుందని అన్నారు. దేశ భక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు ప్లేయింగ్, ఫ్లూటు, పర్వతారోహణ, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవిత్వం, జానపద నృత్యం, జానపద పాటలు, మిమిక్రీ, మ్యాజిక్, సైకిలింగ్, వాలీబాల్, కబడ్డీ, ఖోకో, బ్యాడ్మింటన్, చెస్, ఫుట్ బాల్, రన్నింగ్, జాతీయ సమైక్యత శిబిరం, కరాటే, కూచిపూడి, కోలాటం, తబలా, బతుకమ్మ, స్విమ్మింగ్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, టెన్నిస్, ఆర్చరీ రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బాలమిత్ర అవార్డులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

కూకట్‌పల్లిలో అక్రమ బోర్ తవ్వకాలు

ప్రతిపక్షం, కూకట్ పల్లి, నవంబర్ 13: కూకట్‌పల్లి శ్రీనివాస్‌నగర్‌లో, ఎంఎన్ఆర్ కాలేజ్ ఎదురుగా ఉన్న ఓ ఓపెన్ ప్లాట్‌లో అక్రమ బోర్ తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఒకే ప్లాట్ లో ఐదు బోర్‌లు తవ్వుతున్నప్పటికీ రెవెన్యూ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఫిర్యాదుదారులు మండల రెవెన్యూ అధికారి (తహసీల్దార్) మరియు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్.ఐ)లకు వాట్సాప్ ద్వారా లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు బోర్‌వెల్ యజమానులు శ్రీనివాస్ రెడ్డి, కొండా రెడ్డిలకు సమాచారం లీక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కూకట్‌పల్లి ఆర్.ఐ ఆగస్టిన్ "విషయం సర్దుబాటు చేసుకోండి" అని చెప్పినట్లు స్థానికులు తెలిపారు. తరువాత ఎంఆర్ఓ కార్యాలయం నుండి సూర్యప్రకాశ్ మరియు మరో సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి బోర్ వాహనాని సీజ్ చేయకుండా బోర్ వాహనం యజమాని తో మాట్లాడి వాహనాని అక్కడినుంచి పంపించి సర్దుబాటు చేసుకునీ వెళ్ళిపోయాడు, అంతే కాకుండా ఆ స్థలంలో దాదాపు 20 ఏళ్లుగా ఉన్న చెట్టును కూడా అనుమతి లేకుండా నరికి వేయడం జరిగింది. ప్రభుత్వం బోర్‌వెల్ తవ్వకాలకు సంబంధించి స్పష్టమైన చట్టబద్ధ నిబంధనలు అమలు చేసింది. తహసీల్దార్ 4.5 అంగుళాల వ్యాసం (డైమీటర్) కలిగిన బోర్‌వెల్‌కు మాత్రమే అనుమతి ఇవ్వగలరు. అయితే ఈ ప్రదేశంలో 6.5 అంగుళాల బోర్‌వెల్‌ను అనుమతి లేకుండా తవ్వుతున్నారు. ఇదంతా జరుగుతుండగా, నిరంతర తవ్వకాలు ధూళి మరియు శబ్ద కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఆ ప్రాంత ప్రజలు ఈ కాలుష్యంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఐదు బోర్‌లు తవ్వినా, ఒక్క బోర్ కి కూడా అధికారిక అనుమతి లేకపోవడం మరో తీవ్రమైన చట్ట ఉల్లంఘనగా గుర్తించారు. ఇక, స్థానిక జాతీయ పార్టీ నాయకులు ఫిర్యాదుదారునిపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆ నాయకులకి ఈ చర్యల వల్ల భవిష్యత్తులో జరగవచ్చిన భూకంపాల వంటి విపత్తులను అర్థం చేసుకోలేకపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే ప్లాట్‌లో ఐదు బోర్‌లు తవ్వడం వల్ల భూగర్భ జలస్థాయి పడిపోవడం, నేల ద్రవణం, మరియు పర్యావరణ నష్టం సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను అధికారులు సహకరించడం వెనుక లంచాలు మరియు రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తూనారు, ఈ అవినీతి అధికారులు పై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా గురు ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, కూకట్ పల్లి, నవంబర్ 13: మేడ్చల్ జిల్లా బీజేపీ స్వచ్ఛ భారత్ కన్వీనర్, కెపిహెచ్బి 114 డివిజన్ కన్వీనర్ గురు ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు కెపిహెచ్బిలోని సిబిసిఐడి బీఆర్ మెడోస్ లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య, జాయింట్ సెక్రెటరీ నాగుల అంజిబాబు హాజరై శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎర్ర యాకయ్య మాట్లాడుతూ ప్రజా సేవలో ఆయన చూపిస్తున్న చురుకుదనం,యువ కార్యకర్తలకు ప్రేరణగా నిలుస్తుందని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, స్థానికులు భారీ సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు, సాయుధ పోలీసుల నాకాబందీ

- నిషేధిత, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ఎలాంటివి అక్రమ రవాణా జరగడానికి వీలు లేదు
- జిల్లా ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణలో భాగంగా నాకాబందీ
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 13 : ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండడం వలన, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే నిషేధించబడిన గంజాయి, గుట్కా, అక్రమ మద్యం, ఇతర మాదక ద్రవ్యాలు, పిడిఎస్ రైస్ వంటి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ఏవైనా వస్తువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు. ప్రజల శాంతి, భద్రతల రక్షణలో భాగంగా అంతర్ రాష్ట్ర నేరస్తులు, పేలుడు స్వభావం గల మందుగుండు సామగ్రి జిల్లాలోకి అక్రమంగా రాకుండా ప్రతి రోజు వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నిర్దిష్ట ప్రాంతాలను ఎంపిక చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బుధ వారం రాత్రి 9.00 గంటల నుండి 1.30 గంటల వరకు, చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి-65 పై సుమారు 80 మంది పోలీస్ సిబ్బందిని వివిధ బృందాలుగా విభజించి నాకాబందీ కార్యక్రమం చేపట్టి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో మొత్తం 850 వాహనాలను తనిఖీ చేసి, ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా కారులో తరలిస్తున్న మద్యం స్వాధీనం చేయడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందిపై డీడీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ నాకాబందీ కార్యక్రమం జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివలింగం, బొల్లారం ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, నారాయణఖేడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సాయుధ విభాగం సిబ్బంది, మరియు వివిధ సబ్‌డివిజన్‌లకు చెందిన ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ వీధుల్లో వీధి కుక్కల స్వైర విహారం

- పట్టించుకోని గ్రామ ప్రత్యేకాధికారులు
- ఆందోళన చెందుతున్నగ్రామ ప్రజలు.
- తూ..తూ మంత్రంగా వీధి కుక్కల పట్టివేత.

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 13 : మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులు, పుర వీధుల్లో విధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వింత రోగాలతో రోడ్ల పైన తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న కుక్కలు.కుక్కలు మనుషుల పై మూగజీవులపై అనేక దాడులు, ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని గ్రామ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ అధికారులు, కాలనీలలో కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేతెత్తుతున్నారు. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారిపై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో చిన్నారులు కుక్కల భారీన పడి గాయాల పాలైన అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కల నిర్మూలనకు అధికారుల చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. నిత్యం ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందిన అధికారులు మాత్రం వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడ లేక పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అక్కడ, ఇక్కడ ఒక్కసారి వీధి కుక్కలను పట్టుకోని పోయి అనంతరం చేతులు దులుపుకోవడం అధికారుల వంతుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు వీధి కుక్కల స్వైర విహారంపై స్పందించి నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరతున్నారు.

రాబిస్ వ్యాధిని నివారించడానికి, టీకాలు వేయించుకోవడం అవసరం. పెంపుడు కుక్కలను కలిగి ఉంటే, వాటిని వ్యాధి రహితంగా చూసుకోవాలి. మొయినాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా చేరి ఎవరిపై ఎప్పుడు దాడి చేస్తాయని భయపడుతున్న గ్రామస్తులు. వృద్ధులు, మహిళలు,పిల్లలు ఒంటరిగా వెళ్లాలంటే కుక్కలు ఎవరిపై ఎప్పుడు దాడి చేస్తారు అని భయ పడుతున్నారు తక్షణమే కుక్కలు లేకుండా చూడాలని కోరుతున్నాం.

- బాతుకు భరత్ కుమార్, అమ్డాపూర్

రూ.1.35లక్షల కోట్ల పెట్టుబడి పెట్టే ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను కేవలం జూమ్ కాల్‌తో రప్పించాం. గూగుల్ ఏఐ హబ్‌కు నెలాఖరున శంకుస్థాపన చేస్తాం. టీసీఎస్,కాగ్నిజెంట్ సహా అనేక ఐటీ జెయింట్స్ రాష్ట్రానికి వస్తున్నాయి. 2026 జూన్‌కు భోగాపురం ఎయిర్ పోర్టు నుంచి అంతర్జాతీయ కనెక్టివిటీ ప్రారంభమవుతుంది.

- ఏపీ మంత్రి లోకేశ్

ప్రాంతీయం

150 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన మంత్రి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, నవంబర్ 13: మక్తల్ పట్టణం లో 48 కోట్ల బడ్జెట్ తో నూతనంగా నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రిని మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించి పనులను పరిశీలించారు. పనుల పురోగతి పై అక్కడి అధికారులను, ఇంజనీర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి త్వరలో ప్రజలకు అందుబాటులో కి తెచ్చేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 13: హనుమకొండ లోని జేఎన్ఎస్ లో ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ కొనసాగుతుంది. ఆర్మీలో నియామకాలకు సంబంధించి ఆర్మీ అధికారులు రిక్రూట్మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులకు గురువారం రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలను నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, సూర్యాపేట జిల్లాలకు చెందిన 786 మంది అభ్యర్థులు ఆర్మీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులు కాగా వారికి హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ లో రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్, తదితర పరీక్షలను నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, సూర్యాపేట జిల్లాల చెందిన 786 మంది అభ్యర్థులకుగాను 598 మంది అభ్యర్థులు హాజరై ఆర్మీ నిర్వహించిన రన్నింగ్, ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలో పాల్గొన్నారు. ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఎంపికలు ఆర్మీ నియమ నిబంధనల మేరకు నిర్వహిస్తున్నారు.

జాతి మనుగడ కోసం పనిచేస్తున్న వారిపై ఆరోపణలు తగవు

- **మేడారం లో ఆదివాసీ నాయకుల ఖండన**

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 13: తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో గురువారం ఆదివాసీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలు గద్దం అరుణ గారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో, మేడారం, ఊరట్టం, కాల్వపల్లి, నార్లాపూర్, బయ్యక్కపేట, వెంగళపూర్ గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడిన మాజీ సర్పంచ్ చిడం బాబురావు మరియు పలువురు ఆదివాసీ నాయకులు, నిన్న "సాక్షి" పత్రికలో వచ్చిన ప్రకటనలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడెం బాబు, ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ధబ్బగట్ల సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. "ములుగు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి గారు గిరిజన చట్టాల అమలుకై, ఆదివాసుల మనుగడ కోసం కృషి చేస్తున్నారు. అటువంటి వ్యక్తి పై తప్పుడు ఆరోపణలు చేయడం అసత్య ప్రచారం తప్ప మరొకటి కాదు," అన్నారు. "ఆదివాసి సంఘాలు, ఆదివాసుల అభ్యున్నతి కోసం పని చేయాలి. కానీ అధికార పార్టీల సహకార సంఘాల్లా ప్రవర్తించి, సాటి జాతి బిడ్డపై ప్రకటనలు చేయడం మూర్ఖత్వానికి నిదర్శనం. మేడారం ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం కష్టపడుతున్న నాగజ్యోతి గారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు," అన్నారు. మేడారం ఆలయ అభివృద్ధి విషయంపై వారు వ్యాఖ్యానిస్తూ "మేడారం ఆలయం అభివృద్ధి, మేడారం జాతర విస్తరణ ఎవరి హయాంలో జరిగిందో ప్రజలందరికీ తెలుసు. జాతి కోసం పోరాడుతున్న వారిపై విమర్శలు చేయడం కన్నా, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం నేర్చుకోవాలి," అన్నారు. "ఆలయ అభివృద్ధి పేరిట అక్కడి గిరిజన రైతుల 20 ఎకరాల భూములు తీసుకోవడంపై మీకెందుకు మౌనం? భూములు తీసుకున్నా భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నాగజ్యోతి కోరడం తప్పేంటి?" "మీరు చేస్తున్న ఉద్యమాల పట్ల మాకు గౌరవం ఉంది. కానీ అధికార పార్టీకి కొమ్ముకాస్తూ ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం జాతి ప్రయోజనాల కంటే స్వలాభం కోసం అనిపిస్తోంది," అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మేడారం మాజీ సర్పంచ్ చిడం బాబురావు, వెంగళపూర్ మాజీ సర్పంచ్ గద్దం అరుణ, కన్నెపల్లి మాజీ సర్పంచ్ గొంది శ్రీధర్, నార్లాపూర్ సర్పంచ్ సిద్దబోయిన చిన్నక్క, ఆదివాసీ నాయకులు శివరాజ్, సోలం వెంకన్న (మాజీ ఎం.పి.టి.సి), ఆలం కృష్ణ, అర్జున్, సుధీర్, గిరిజన అభ్యుదయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముద్దబోయిన రవి, సమ్మక్క పూజారి సిద్దబోయిన రవీందర్, ఇతర ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీళ్లు వృథా

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, నవంబర్ 13: వాజేడు మండలం సమీపంలోని జగన్నాథపురం వైపుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్నది. ముఖ్యంగా తయిస్మా బోర్ సమీపంలో పైపు పగిలిపోవడంతో, ఉదయం వేళల్లో పెద్ద ఎత్తున నీరు ఉద్ధృతంగా బయటికి పొంగిపడుతూ చుట్టుపక్కల నేలమట్టం చెరువులా మారిపోయింది. ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం కింద అమర్చిన పైప్‌లైన్‌లు తరచుగా పగుళ్లు రావడం వల్ల భారీగా నీటి వృథా జరుగుతున్నదని గ్రామస్థులు తెలిపారు. వాజేడు మండలం పరిధిలో ఇలాంటి లీకేజీలు గత కొద్దిరోజులుగా పలు చోట్ల చోటుచేసుకోవడం ఆందోళనకరమని వారు అభిప్రాయపడ్డారు. స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, మరమ్మత్తు పనులు చేపట్టడంలో ఆలస్యం జరుగుతుందని వాపోతున్నారు. తాగునీటి కొరత ఉన్న సమయంలో ఇలా పెద్ద మొత్తంలో నీరు వృథా కావడం ప్రజలకు బాధాకరమని వారు పేర్కొన్నారు. గ్రామస్థులు వెంటనే వాజేడు మండలం తయిస్మా బోర్ సమీపంలోని పైప్‌లైన్‌ను మరమ్మతు చేసి, నీటి వృథా ఆపేలా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ, జలమండలి అధికారులను కోరుతున్నారు.

సహారా కేంద్రం ఆదర్శప్రాయంగా ఉంది

- **జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 13 : మానసిక వికలాంగత తో బాధపడుతున్న పిల్లలు మన సమాజంలో అంతర్భాగం. వారికి సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రం లోని హాస్టల్ గడ్డలో ఉన్న సహారా ప్రాథమిక పునరావాస కేంద్రం (ఎస్ ఆర్ హెచ్ సి) లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఇలాంటి సమగ్ర పునరావాస కేంద్రాలు ఏర్పాటు తో వికలాంగత పిల్లలకు ప్రయోజనం కలుగుతుంది అని కలెక్టర్ అన్నారు . పిల్లల కోసం సంస్థ చేపడుతున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ వంటి సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలోని అంచున ఉన్న పిల్లలకు ప్రేమ, శ్రద్ధ, విద్య, ఆరోగ్యం అందించాలనే సంకల్పాన్ని బలపరుస్తూ సహారా కేంద్రం సేవలు వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నాయి అని కలెక్టర్ అన్నారు. సహారా కేంద్రం ఆదర్శప్రాయంగా ఉంది అని అభిప్రాయపడ్డారు. సహారా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమా రెడ్డి, డైరెక్టర్ శంకర్లు కేంద్రం కార్యకలాపాలను కలెక్టర్ కు వివరించారు . ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ త్వరలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం ఇన్‌క్లూజివ్ స్కూల్ ప్రారంభించే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వారు వెల్లడించారు. సాధారణ విద్యార్థులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలు కలిసి చదివే విధంగా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ పద్ధతిని అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో 50 మందికి పైగా పిల్లలు వివిధ థెరపీలను పొందుతున్నారని తెలిపారు. ఇతర సేవలతో పాటు, సహారా సంస్థ ఒక ఇన్‌క్లూజివ్ ఆసుపత్రిని కూడా నిర్వహిస్తోంది. ఇక్కడ పిల్లలు, పెద్దలు అందరూ వైద్య, మానసిక, శారీరక పునరావాస సేవలు పొందుతున్నారు. అలాగే వికలాంగుల నైపుణ్యాభివృద్ధి కోసం వృత్తి శిక్షణా కేంద్రం ద్వారా హస్తకళలు, కంప్యూటర్ నైపుణ్యాలు, చిన్న వ్యాపార శిక్షణ వంటి కోర్సులు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, తల్లిదండ్రులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాళోజి వర్ధంతి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 13. కాళోజి నారాయణరావు సేవలు మరువలేనివని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. కాళోజీ నారాయణరావు 23వ వర్ధంతిని అలియాబాద్ మున్సిపల్ పరిధి లోని మజీద్ పూర్ లో గురువారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిజినల్ ట్రాన్స్పోర్ట్ ఆథారిటి మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, మాజీ సర్పంచ్ ఎల్ల మల్లేష్, మాజీ ఎంపీటీసీ సరసం అశోక్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కుడుములు వెంకటేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి వజ్జల శేశాంత్ (బన్నీ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్ , కాంగ్రెస్ నాయకులు తుంకి లక్ష్మయ్య, అబ్బగౌని వెంకటయ్య , పల్లె రాంబాబు, అన్నంగల్ల యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోడు రైతులను అరిగోస పెడుతున్న సర్కార్

- **పోడు పట్టాలు ఇవ్వకుండా.. రైతుల చేతులకు బేడీలు వేస్తారా**
- **ఎమ్మెల్సీ డా. చిన్న మైల్ అంజిరెడ్డి.**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 13 : పోడు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అరిగోస పెడుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. అయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట ఫారెస్ట్ ఆఫీస్ వద్దకు తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ వినతి పత్రం అందించేందుకు వచ్చిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. గత 20 ఏండ్లగా భూమిని నమ్ముకొని సాగు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న రైతులపై ఫారెస్ట్ అధికారులు బెదిరింపులు అక్రమ కేసులు బనాయించడం ఏంటి అని ప్రశ్నించారు. ఇప్పటి కాంగ్రెస్, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు పోడు భూములకు పక్కా పట్టాలిస్తామని కల్లి బోల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక రైతుల చేతులకి సంకెళ్లు వేయడం ఎంతవరకు సబబు.? 'ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర ఇప్పటివరకు లేదు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెట్టి నామరూపాలు లేకుండా పోయింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే మాదిరిగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుంది. దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన 27 మంది పోడు రైతుల మీద వారెంట్ జారీ చేయడం ఫారెస్ట్ అధికారులు బెదిరింపులకు పాల్పడడం దారుణం. ఇప్పటికే పోడు రైతుల విషయంలో వారికి న్యాయం చేసేలా బీజేపీ పోరాటం చేస్తుంది. రైతుల పక్షాన పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. ఫారెస్ట్ అధికారుల వేధింపులు, పోలీసుల అక్రమ అరెస్ట్ లు ఆపి, వారికి పోడు పట్టాలను అందించాలని డిమాండ్ చేస్తున్న లేని యెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు.

ప్రమాద భరితంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్

ప్రతిపక్షం, వనపర్తి ప్రతినిధి, నవంబర్ 13 : వనపర్తి పట్టణంలోని 24 వార్డు బండార్ నగర్ లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు ,తీగల చుట్టూ అల్లుకోవడం జరిగిందని, దీనివల్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని 24వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి గజరాజుల తిరుమలేష్ ఆరోపించారు. గురువారం వనపర్తి మున్సిపల్ కమిషనర్ కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడం వల్ల విద్యుత్ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని,కావున విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ట్రాన్స్ఫారం చుట్టూ ఉన్నటువంటి పిచ్చి మొక్కలను తొలగించాలని, చుట్టూ రక్షణగా కంచె ఏర్పాటు చేసి స్థానిక ప్రజల సమస్యను తీర్చాలని కోరారు.

వాచ్‌మెన్ శేఖర్ విధుల నుంచి తొలగింపు

- **సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ హాస్టల్ ఘటనపై కలెక్టర్ ఆదేశాలు**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 13 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇస్మాయిల్ ఖాన్ పేట్ ఎస్సీ/ఎస్టీ బాలుర హాస్టల్‌లో చోటుచేసుకున్న ఘటనపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంఘటనపై పూర్తి నివేదికను కోరుతూ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ ను తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ అందించిన వివరాల ప్రకారం, నవంబర్ 12 రాత్రి హాస్టల్ వాచ్‌మెన్ శేఖర్ మద్యం సేవించి, వండిన అన్నం గిన్నెలో కాళ్లు పెట్టిన ఘటన చోటుచేసుకుంది. సంగారెడ్డి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పి .జానకి దేవి ఇచ్చిన రిపోర్టు ప్రకారం ,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘటనకు బాధ్యుడైన వాచ్‌మెన్ శేఖర్‌ను విధుల నుండి తక్షణమే తొలగించడం జరిగిందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే కాంట్రాక్టర్‌కు హెచ్చరిక జారీచేశారు. ప్రతిరోజు హాస్టల్ పర్యవేక్షణ కోసం ఒక ఉపాధ్యాయుని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాల్సిందిగా ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వసతి గృహాలను పర్యవేక్షించాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలి

- **సెంటర్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 13: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులు, సెంటర్ల నిర్వాహకులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం, ఎల్కతుర్తి లోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సూరారం గ్రామంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సరైన వసతులు లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తాగునీరు, నీడ సౌకర్యాన్ని ఏర్పాటు చేయకపోవడంపై నిర్వాహకుల పట్ల కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, కనీస సౌకర్యాలను ఎందుకు కల్పించలేదని నిర్వాహకులను ప్రశ్నించారు. ఎల్కతుర్తి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించి కొనుగోలు చేసిన వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు టోకెన్ ఇచ్చిన తర్వాతనే సెంటర్ నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. గన్నీ సంచులు సరిపోను దాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉండాలని, గన్ని సంచుల అవసరం మేరకు ఏపీఓకు సమాచారం అందించి ఇండెంట్ పెట్టించాలన్నారు. ప్రతి దాన్యం కొనుగోలు వద్ద తప్పనిసరిగా ధాన్యానికి సంబంధించిన కనీసం మద్దతు ధర, తేమశాతం, తదితర వివరాలు తెలిపే బ్యానర్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఆ బ్యానర్ లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలపై ఇబ్బందులు ఫిర్యాదుల కోసం రైతులకు ఉపయోగపడే విధంగా కంట్రోల్ రూమ్ నంబర్ ను ఉంచాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తప్పనిసరిగా తాగునీరు, నీడ సౌకర్యాలు ఉండాలని, గన్ని సంచులను భద్రపరచుకోవడానికి గది ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని వర్షాల నుండి కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్యాడి క్లీనర్ల ద్వారా ధాన్యాన్ని క్లీన్ చేసుకునేలా సౌకర్యం ఉండాలన్నారు. రైతులు ధాన్యం తరలింపును సొంత ఖర్చులతో చేయవద్దని, ధాన్యం కాంట పూర్తి కాగానే ప్యాడి ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, స్థానిక తహసిల్దార్ ప్రసాదరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రూ.8.87 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు కేబినెట్‌లో అనుమతి ఇచ్చాం. దీని ద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయి. ఇవాళ రూ.2.66 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. సంపద సృష్టి కోసం అందరం జట్టుగా పని చేశాం. 20 లక్షల ఉద్యోగాల హామీని నిరూపించాం. 2047 నాటికి తలసరి ఆదాయం రూ.54 లక్షలకు పెంచడమే తమ లక్ష్యం.

- విశాఖ ఎకనమిక్ రీజియన్ సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

కరీంనగర్ విద్యారంగం ఆదర్శం

- వినూత్న కార్యక్రమాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు
- కలెక్టర్ కృషికి విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు ప్రశంసలు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 13: కరీంనగర్ జిల్లాలో విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంపొందించేలా రూపొందించిన కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి ప్రశంసించారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో జిల్లాలో విద్యారంగ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి జిల్లాలో చేపట్టిన 20కి పైగా వినూత్న విద్యా కార్యక్రమాలు - బోధన స్నేహిత, కాన్షియస్ క్లబ్, విటమిన్ గార్డెన్స్, ట్రాఫిక్ అవేర్నెస్, ఇండియన్ సైన్ లాంగ్వేజ్, గణితసైన్స్ ఒలంపియాడ్, టెట్ ఎడ్ సమ్మర్ క్యాంప్స్ తదితర ప్రాజెక్టులపై పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ ప్రజెంటేషన్ ఆకట్టుకున్నదని ఆకునూరు మురళి తెలిపారు. విద్యార్థుల హాజరు, ఫలితాలు, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలల మౌలిక సదుపాయాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష జరిపిన తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 మండలాల్లో "తెలంగాణ పబ్లిక్ స్కూల్స్" ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని ఆయన వెల్లడించారు. ప్రతి మండలంలో ఐదు ఎకరాల స్థలంలో ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యను ఒకే చోట అందించే ఆధునిక పాఠశాలలను నిర్మించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలపై రూ.10-15 కోట్ల వరకు వ్యయం అంచనా వేస్తున్నామని వివరించారు. కరీంనగర్ జిల్లాకు విద్యారంగంలో మంచి పేరు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. "విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో పకడ్బందీగా వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు మంచి విద్య అందించడం మా ప్రధాన ధ్యేయం," అని చెప్పారు.

చల్లూరు పాఠశాల సందర్శన

వీణవంక మండలం చల్లూరు గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌ను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి బోధన నాణ్యతను పరిశీలించారు. పాఠశాల వసతులు, బోధన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఈఓ మొండయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సైన్స్ ఆఫీసర్ జైపాల్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాసు, జెండర్ కోఆర్డినేటర్ కృపారాణి, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఏ కష్టం వచ్చినా నా వద్దకు రండి

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 13:- హవేలీ ఘనపురం మండలంలోని చౌట్లపల్లి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ఆప్యాయతగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పదని, మీకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని గ్రామంలో వృద్ధులకు భరోసా ఇచ్చారు. గ్రామంలో ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు గ్రామస్తులు ప్రతి ఒకరికి అందాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరశురామ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పరిమళించిన
మానవత్వం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 13: దబ్బెర రేణుకను మానవత్వంతో ఆదుకోండి అని పత్రికలలో వచ్చిన కథనాన్ని చూసి స్పందించిన సంస్కార భారతి సిద్దిపేట జిల్లా మాతృ శక్తి కన్వీనర్ కాసర్ల మంజులా రెడ్డి స్పందించారు. చలికాలం కావడంతో అత్యవసర సాయంగా బ్లాంకెట్లు, తల్లి పిల్లలకు స్వెటర్లను అందజేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తే తమ వంతు సహాయంగా సహకరిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. గూడు లేని రేణుకను ఇంకా ఎంతో మంది మానవత్వంతో ఆదుకోవాలని అభ్యర్థించారు.

సురభి మెడికల్ కళాశాలలో

ఉచిత వైద్య శిబిరం

- రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలను వినియోగించుకోవాలి
- మెగా హెల్త్ క్యాంపు ను ప్రారంభించిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 13: రాజీవ్ ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా సిద్దిపేట అర్బన్ మండలంలోని సురభి మెడికల్ కాలేజీలో మెరుగైన వైద్య సేవలను అందిపుచ్చుకోవాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం లోని మిట్టపల్లి గ్రామంలో ఉన్న సురభి మెడికల్ కాలేజీలో కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ కౌన్సిలర్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అత్తు ఇమామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ సురభి కళాశాలలో ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి అని అన్నారు. సురభి మెడికల్ కళాశాల యాజమాన్యం ముందుకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. అబ్బాస్ (న్యూరో సర్జన్), డా.జలపతి నాయక్ (ఆర్ఎంఓ), డా. బ్రహ్మం (పీజియో థెరపీ ప్రిన్సిపల్) సురభి ప్యాకల్టీ, పీఆర్ఓ వేణుగోపాల్, సచిన్ ,60 మంది సీనియర్ డాక్టర్లు, నర్సింగ్ స్టాప్ మార్కెటింగ్ బృందం సపోర్టింగ్ స్టాఫ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో ధర్మ సత్రాన్ని అందుబాటులోకి తెస్తాం

- పనులను పరిశీలించిన జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 13: కొమురవెల్లి మల్లికార్జునస్వామివారి క్షేత్రంలో 50 గదుల సత్రం, క్యూకాంప్లెక్స్ భవనాలను జాతర బ్రహ్మోత్సవాల వరకు అందుబాటులోకి తెస్తామని జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం ఆలయ ఈఓ టీ. వెంకటేష్ తో కలిసి కొమురవెల్లిలోని బండగుట్టపైన నిర్మిస్తున్న 50 గదుల ధర్మసత్రం పనులను, అలాగే రాజగోపురం ముందు నిర్మిస్తున్న క్యూకాంప్లెక్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాఫ్ రెడ్డి మాట్లాడుతూ జాతర బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్న తరుణంలో భవనాలను అందుబాటులోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు పనుల పురోగతిపై అధికారులను అడిగి వారు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు నీల శేఖర్, ఆలయ డైరెక్టర్ లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు చింతల రమేష్, లింగంపల్లి కనకరాజు, ఎర్పుల రాజు, ఉప్పల వంశీ, గుండా మహేష్, ఎనిశెట్టి కిరణ్ తదితరులు ఉన్నారు.

బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడి అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 13: సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ, సిద్దిపేటకు చెందిన సమీర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి నిందితుడు ఆ బాలిక ఇంటికి వెళ్లి, ఆమె తల్లిదండ్రులతో మీ కూతురిని ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటాను అంటూ గొడవపడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడు సమీర్‌ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. అనంతరం నిందితుడిని 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపి, సిద్దిపేట జిల్లా జైలుకు తరలించారు.

నేడు థియేటర్లలోకి 'గోపీగాళ్ల గోవా ట్రిప్'

- ప్రధాన పాత్రలో సిద్దిపేట కుర్రోడు
- ఆదరించాలని కోరిన డైరెక్టర్ శశి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 13: తెలంగాణ యాసలో, యవ్వనంలో కుర్రోళ్లు కోరుకునే ఎంజాయ్, గోవాలో ఎదుర్కొన్న పరిస్థితులు, పర్యావసనాలను యువత మెచ్చేలా 'గోపీ గాళ్ల గోవా ట్రిప్' సినిమాను రూపొందించామని దర్శకులు శశి తెలిపారు. సిద్దిపేట(ఇమాంబాద్)కు చెందిన కుర్రోడు శివరాత్రి రాజు ప్రధాన పాత్రలో రూపొందిన సినిమా శుక్రవారం విడుదల అవుతున్న సందర్భంగా దర్శకులు శశి, ప్రధాన పాత్రధారి రాజులు సినిమా విశేషాలు వెల్లడించారు. అవంతి సినిమా బ్యానర్ పై, సాయి కుమార్ నిర్మాణ సారథ్యంలో ఎనిమిది మంది ప్రధాన పాత్రదారులతో నిర్మించిన ఈ చిత్రం 70 థియేటర్లలో విడుదల కాబోతుందని, శనివారం నుండి సిద్దిపేటలోని శ్రీ శ్రీనివాస్ థియేటర్‌లో సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుందన్నారు. ఎంతో కష్టపడి 20 రోజుల్లో షూటింగ్ ముగించుకుని ఎక్కడా చిన్న సినిమా అనే అభిప్రాయం కల్గకుండా, సహజత్వం ఉట్టిపడేలా సినిమాను తీసామని ఆదరించి ఆశీర్వదించాలని దర్శకులు కోరారు. ప్రధాన పాత్రధారి రాజు మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన తాను 8 ఏండ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి సినిమానే ప్రపంచంగా బతుకుతున్నానని, అవకాశం వస్తే తానేంటో నిరూపించుకోవడానికి దర్శకులు శశి 'గోపీ గాళ్ల గోవా ట్రిప్' లో అవకాశం ఇచ్చారని, ప్రాణం పెట్టి పని చేశానని, ఆదరించాలని కోరారు. తెలంగాణ మాండలికాన్ని ఉపయోగించి, సహజత్వం ఉట్టిపడేలా తీసిన సినిమాలో సిద్దిపేట కుర్రోడు రాజు ఉండటంతో సినిమా హిట్ కావాలని ఆకాంక్షిస్తూ రాజును జర్నలిస్టులు అభినందించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు
- మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 13: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన దిశగా ఎదిగాలేలా ప్రోత్సహించడమే ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ఉద్దేశం అని డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మెదక్ మండలం మంభోజపల్లిలో మహిళలకి ఉచితంగా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సహకారంతో, మహిళా శిశు సంక్షేమ శాఖ మెదక్ ఆధ్వర్యంలో టీడబ్ల్యూఓ హేమ భార్గవి, మెదక్ ప్రాజెక్ట్ సీడీపీఓ సూపర్వైజర్ మాధవి మహిళా సాధికారత టీంతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ కార్యక్రమం మహిళా సాధికారత కేంద్రాల ద్వారా నిర్వహిస్తుందని అన్నారు. అనంతరం డీడబ్ల్యూఓ హేమ భార్గవి మాట్లాడుతూ.. మహిళా సాధికారత పెరుగుతుందని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి కల్పిస్తున్నందుకు చాలా సంతోషమని అన్నారు. సంగారెడ్డి స్టేట్ బ్యాంక్ గ్రామీణ సంస్థ నర్సింహులు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి ఈ శిక్షణ ఒక మైలురాయి అవుతుందని, స్వయం ఉపాధికి వీలుగా నైపుణ్యాలను అందించడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. మంభోజిపల్లి లో 30 రోజులు ట్రైనింగ్ జరుగుతుందని అన్నారు. వీరికి కావలసిన భోజనము,వసతి సౌకర్యము టైలరింగ్ ట్రైనింగ్ ఈ మా ఆధ్వర్యంలో పాన్సర్షిప్ చేస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ప్రాజెక్ట్ సిడిపిఓ సూపర్వైజర్ మాధవి , పంచాయతీ సెక్రెటరీ , ట్రైనింగ్ టీచర్, మహిళా సాధికారత టీం కోఆర్డినేటర్ సంతోషి,జెండర్, స్పెషలిస్ట్ నాగమణి, ఎస్ ఫ్ ల్ రమేష్,సి సి శివరంజని , వివో లీడర్స్ మాధవి, మహిళలు పాల్గొన్నారు.

భార్యను కత్తితో పొడిచి భర్త ఆత్మహత్య

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 13: మతిస్థిమితం లేక భార్యను కత్తితో పొడిచి మరుసటి రోజు రైలు పట్టాల కింద పడి మరణించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. తూప్రాన్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన అంగడి శంకర్ గత మూడు రోజులుగా మతిస్థిమితం లేక వింత చేష్టలతో పలువురిని భయభ్రాంతులకు గురి చేశాడు. అంతకుముందు తన సోదరుని మనుమరాలిని బిల్డింగ్ పై నుంచి తోసి వేసినట్లు గ్రామస్తులు తెలిపారు. చివరకు శంకర్ రైలు కిందపడి మరణించినట్లు పోలీసులు ధృవీకరించారు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయండి

- జిల్లా కొండా లక్ష్మణ్ బాపూజీ గ్లోబల్ ఫెడరేషన్ పిలుపు

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 13: 42% బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డిలో జరిగే బీసీ ఆక్రోశ సభ ను విజయవంతం చేయాలని సిద్దిపేట జిల్లా కొండా లక్ష్మణ్ బాపూజీ గ్లోబల్ ఫెడరేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. జస్టిస్ ఈశ్వరయ్య, టి. చిరంజీవులు, విశాధరన్ మహారాజ్, బాలగోని బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో పెట్టకుండా అడ్డుకుంటున్న బీజేపీ, బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్న, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్య మోసాల పై ఈ సభలో బీసీ వర్గాలు ఆక్రోశం వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ బంధువులు, సిద్దిపేట జిల్లా పట్టణ పద్మశాలి సంఘం సమాజం సభ్యులు కూడా అధిక సంఖ్యలో బీసీ ఆక్రోశ సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం పట్టణ పద్మశాలి సమాజం నాయకులు ముదిగొండ శ్రీనివాస్, సిరిగది బాలరాజ్, సూరం ప్రసాద్, డికొండ మహేష్, గాడిపల్లి సంతోష్, పాసికంటి రామచంద్రం, ఉప్పరపల్లి బాలచంద్రం, గడ్డమీది యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పేలుడు నిందితులకు విధించే శిక్ష ప్రపంచానికి బలమైన సందేశం పంపుతుంది. మరోసారి అలాంటి అటాక్ చేయాలనే ఆలోచన కూడా రాకుండా శిక్షిస్తాం. నిందితులపై తీసుకునే చర్యలతో భారత్ ఏ రూపంలోనైనా ఉగ్రవాదాన్ని సహించదని నిరూపిస్తాం. మనకు హాని కలిగించాలని ప్రయత్నించే వారు ఎవరైనా కఠిన పరిణామాలను ఎదుర్కొంటారు.

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ఉపకార వేతనాల రెన్యూవల్, రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 13: ప్రస్తుత విద్యా సంవత్సరంలో షెడ్యూల్ కులాలకు సంబంధించి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం పెండింగ్‌లోని రెన్యూవల్, నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో వసతి గృహాల సంక్షేమాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటిని విద్యార్థులకు స్కాలర్షిప్ల రూపంలో ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. చదువుకునే పేద పిల్లలకు ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు అండగా ఉంటాయని, డబ్బు సమస్య లేకుంటే విద్యార్థి చదువుపై ధ్యాస ఉంటుందని, చదువులో చక్కగా రాణిస్తారన్నారు. 2025-26కు సంబంధించి పాఠశాల మరియు కళాశాల స్థాయిలో పెండింగ్‌లో దరఖాస్తుల పునరుద్ధరణ (రెన్యూవల్), ప్రస్తుత విద్యా సంవత్సరంలో పెండింగ్‌లోని నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియతో పాటు బయోమెట్రిక్‌ను పూర్తి చేయాలని సూచించారు. గడువులోగా హార్డ్‌కాపీలను సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల మరియు కళాశాలల ప్రిన్సిపాళ్లకు, ప్రతినిధులకు సూచించారు. విద్యార్థులకు కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో సత్వర చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ జిల్లా విద్యాశాఖాధికారి విజయ, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల సంక్షేమాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయం

17న మల్లుపల్లిలో స్థూపం నిర్మాణ స్మారక సభ

- కరపత్రం విడుదల చేసిన అమరవీరుల స్మారక కమిటీ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 13: ఉమ్మడి మెదక్ జిల్లాలో పీడిత ప్రజల హక్కుల పాలకుల దోపిడి పీడన నుండి విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసిన త్యాగధనులను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థం అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడం జరుగుతుందని అమరవీరుల స్మారక కమిటీ కన్వీనర్ శివరాజు కోకన్వీనర్ మేకల రాములు తెలిపారు. ఈ సందర్భంగా వారు కరపత్రాన్ని విడుదల చేశారు. గురువారం మెదక్ గుల్షన్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 17న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో స్థూపం నిర్మాణ ప్రారంభ కార్యక్రమం స్మారక సభను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అమరుల జ్ఞాపకార్థం స్థూప నిర్మాణం జరుగుతుందని, ప్రజలందరూ ఆర్థిక సహకారాన్ని అందించాలని కోరారు.

అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- రాజగోపాలపేట ఎస్ఐ వివేక్

ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 13: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజగోపాలపేట ఎస్ఐ టి.వివేక్ విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు తదితర అంశాలపై షీ టీం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వివేక్, మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోక్సో చట్టం, బాల్య వివాహాలు పరిణామాల గురించి వివరించారు. ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను అవసరం మేరకే వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత వివరించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు నుండి రక్షణ పొందే విధానంపై అవగాహన కల్పించుకోవాలని అన్నారు. ఎవరైనా వేధించినా.. రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా.. ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100 సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 , స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 9494639498, మహిళా పోలీస్ స్టేషన్ 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ సిబ్బంది ఏఎస్ఐ కిషన్, కానిస్టేబుల్ ప్రవీణ్, మహిళా కానిస్టేబుళ్లు రజిని, మమత పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎంపీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 13: ఈ నెల 18న సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో నిర్వహించనున్న యువజన ఉత్సవాల పోస్టర్లను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి తో కలిసి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, జిల్లా క్రీడలు యువజన అధికారి వెంకట నరసయ్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- డీపీఎం యాదయ్య

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 13: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని డీపీఎం యాదయ్య అన్నారు. నిజాంపేట మండలం నంద గోకుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 48 గంటలలోనే రైతుల ఖాతాలో డబ్బులు జమవుతాయని పేర్కొన్నారు. వర్షాలు ఎప్పుడు సంభవిస్తాయో తెలియదు కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రికార్డులను పరిశీలించి నిర్వాహకులు పలు సూచనలు చేశారు. వీరి వెంట ఏపీఎం అశోక్, సీసీ వెంకటరాజం, రవీందర్, నిర్వాహకులు బురాని మంగమ్మ, వాణి, రజిత, రైతులు ఉన్నారు.

చేగుంట హైస్కూల్లో కాళోజీ వర్ధంతి

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 13: చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో కాలోజీ నారాయణరావు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయనకు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేష్, తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, సత్యనారాయణ, రాధ, శారద, భవాని, సరస్వతి, రమాదేవి, శ్రీవాణి, ఉమామహేశ్వరి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆసుపత్రులపై నిఘా పెట్టాలి

- ప్రతి ఆసుపత్రిలో రేట్ చార్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలి
- గజ్వేల్ ఆసుపత్రిలో పనిచేయని సిబ్బందికి వేతనాలు
- ప్రోటోకాల్ పాటించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షతన దిశ సమావేశం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 13: ప్రయివేటు ఆసుపత్రులపై గట్టి నిఘా పెట్టాలని, ప్రతి ఆసుపత్రిలో ఫైర్ సేఫ్టీ, పార్కింగ్ స్థలాలు లేకుండా నిర్వహిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో రేట్ చార్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎంసీహెచ్ లపై పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. గజ్వేల్ ఆసుపత్రిలో పనిచేయని సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారని, వాటిని రికవరీ చేయాలని, రోగులకు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిందిగా సూచిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటుగా అలాంటి వారెవరు ఆసుపత్రి ఆవరణలో లేకుండా కఠినంగా వ్యవహరించాలని ఎంపీ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ లోని ప్రధాన సమావేశ మందిరంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పనుల ప్రగతిపై జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ(దిశా) సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ... గత దిశా సమావేశానికి సంబంధించిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్, గత ఎంపీల కాలంలో మంజూరైన నిధుల వివరాలు సమర్పించాలని, ఇప్పటికే 17వ లోకసభ పెండింగ్ బకాయిలు చెల్లించడం జరుగుతుందని, 16వ లోకసభ కు సంబంధించిన పెండింగ్ బిల్లుల వివరాలు సమర్పించినట్లయితే పార్లమెంట్లో మాట్లాడి వాటిని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తానని తెలిపారు. దుబ్బాక నియోజక వర్గంలో 998 రెండు పడక గదుల ఇళ్లు కట్టి ఉన్నాయని, 600 మంది లబ్ధిదారుల ఇళ్లు మంజూరు చేయగా, మిగిలిన ఇళ్లలో ఉంటున్న వారిలో అర్హత ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అన్నారు. జిల్లాకు మొత్తం 13,276 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 11201శాంక్షన్ ఇవ్వడం జరిగిందని, మొదటి విడతలో 10300 ఇళ్లకు నిర్మాణ స్థాయిలవారీగా నిధులు మంజూరయ్యాయని హౌసింగ్ అధికారులు తెలిపారు. అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాకు 37 గ్రామపంచాయితీ భవనాలు మంజూరు కాగా అందులో 18 గ్రౌండింగ్ అయ్యాయని అధికారులు తెలుపగా, జిల్లాలో 50 సంవత్సరాలు పూర్తయిన ఇంకా పూర్తిగా జీపీ భవనాలు లేని గ్రామాల వివరాలను, పెండింగ్ ఎంపి లాడ్స్ వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గోసాన్పల్లి సబ్ స్టేషన్ పనులు త్వరితగతిన ప్రారంభించాలని, విద్యుత్ ఘాతంతో ప్రమాదాలకు గురైన బాధితులు, వారి కుటుంబాలకు సహకారం అందించాలని, మల్లన్నసాగర్ ద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని చివరి గ్రామాల వరకు కాలువలు, చెరువుల ద్వారా నీళ్లు అందించాలని అన్నారు. రాష్ట్రానికి బయటి రాష్ట్రాల నుంచి చేప పిల్లలను తెచ్చి మత్స్యకారులకు పంపిణీ చేయడం జరుగుతుందని, అలా కాకుండా స్థానికంగా చేప పిల్లల పెంపకం కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని, తద్వారా మత్స్యకారులకు నాణ్యమైన తెలంగాణ చేప పిల్లలను అందించగలమని తెలిపారు. లక్ష పైగా కార్మికులు ఉన్నచోట ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేస్తారని, వారి వివరాలను సమర్పిస్తే ఈఎస్ఐ ఆసుపత్రి కొరకు ప్రతిపాదనలు పంపిస్తానని తెలిపారు. కాటన్ కొనుగోలులో తేమశాతం చూపుతూ రైతులను మిల్లర్లు ఇబ్బందులు గురిచేయకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, డీఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఆయా శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, దిశా కమిటీ సభ్యులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమొచ్చినట్లు రేట్లు పెంచేస్తారా?

- భక్తుల ఇబ్బందులను పట్టించుకోరా?
- ఆర్జిత సేవా రుసుంను పెంచడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- తక్షణమే రేట్లు తగ్గించి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సూచన

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 13: కొండగట్టు దేవస్థానంలో ఆర్జిత సేవా రుసుంను భారీగా పెంచడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాల్లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాల మీద దృష్టి సారించాల్సిన అధికారులు వాటిని విస్మరించడమే కాకుండా ఆర్జిత సేవా రుసుం పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచడమేంటని ప్రశ్నించారు. కంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్ మాట్లాడుతూ కొండగట్టులో ఆర్జిత సేవా రుసుం పెంపుపై అసహనం వ్యక్తం చేశారు. ‘‘కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాల్లేవు. తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ టైంలో కనీస సౌకర్యాలపై దృష్టి సారించకుండా అడ్డగోలుగా ఆర్జిత సేవా రుసుంను పెంచడమేంటి?’’అని ప్రశ్నించారు. తక్షణమే ఆర్జిత సేవా రుసుంను తగ్గించాలని సూచించారు. అట్లాగే కొండగట్టు దేవస్థానంలో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టి భక్తులకు ఇబ్బందులను తొలగించాలని కోరారు.

వార్డు అధికారులకు ట్యాబ్‌లు అందజేత

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 13: క్షేత్ర స్థాయిలో ప్రజలకు మున్సిపల్ సర్వీసులు అందించడంలో వార్డు అధికారులు కీలక పాత్ర నిర్వహించాల్సి ఉన్నందున సాంకేతిక సహకారం కొరకు ట్యాబ్ లు అందజేసినట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వార్డు అధికారులకు ట్యాబ్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జియో టాగింగ్ చేయడం , సర్వేల వివరాలు ఆన్ లైన్ లోనమోదు చేయడం, యాప్లో సమస్యల పరిశీలన, పరిష్కారం వంటి బహుళ సేవలకు ఈ ట్యాబ్ లు ఉపయోగపడతాయని అన్నారు. ప్రజలు కూడా తమ సమస్యలను వార్డు అధికారులకు స్వయంగా లేదా ఫోన్ ద్వారా దృష్టికి తీసుకు రావాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీ రామన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన చుక్క లత

- సన్మానించిన బీజేపీ నేతలు పుల్లెల పవన్, అజయ్ వర్మ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 13: కరీంనగర్ పట్టణం ఉస్మాన్పురకు చెందిన చుక్క నరసయ్య పోచమ్మ, దంపతుల కూతురు చుక్కలత ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, డాక్టర్ పుల్లెల పవన్ గురువారం చుక్క లతను ఘనంగా సన్మానించారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో " రీసెర్చ్ స్కాలర్స్ ఆస్పిరేషన్స్, జాబ్ అపోర్చునిటీస్ అండ్ ఎడ్యుకేషనల్ వేస్టేజీ ఏ కంపరేటివ్ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ యూనివర్సిటీస్ ఇన్ ఇండియా" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను చుక్క లతకు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేటును ప్రకటించింది. పీహెచ్డీ కోర్స్ చేస్తున్న క్రమంలోనే తన తల్లి క్యాన్సర్ బారిన పడి మరణించింది. అయినప్పటికీ అధైర్య పడకుండా మొక్కవోని దీక్షతో పరిశోధన పూర్తిచేసి చుక్క లత డాక్టరేట్ పొందింది. తన పరిశోధనకు సహకరించిన ఓయూ సోషియాలజీ విభాగం అధ్యాపకులు, ఇతర మిత్రులకు చుక్క లత కృతజ్ఞతలు తెలిపారు. తన డాక్టరేట్ ను తల్లిదండ్రులైన చుక్క నరసయ్య, పోచమ్మలకు అంకితం ఇస్తున్నట్లు డాక్టర్ లత తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

- ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 13: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో గత ఆరేదు సంవత్సరాలుగా స్ట్రక్చర్ సమావేశాలు జరుగక కార్మికుల సమస్యలు పరిష్కారం కాక పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ఏఐటీయూసీ యాజమాన్యంతో జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించి కొన్ని సమస్యల్ని పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా స్వంత ఇంటి పథకం అమలు కోసం యాజమాన్యం ఏర్పాటు చేసిన అధికారిక కమిటీలో యూనియన్ సభ్యులను తీసుకుని విధివిధానాలను ఖరారు చేసి అమలు చేసేందుకు యాజమాన్యం ఇటీవలే జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో అంగీకరించిందని ఆయన తెలిపారు. అదే విధంగా సింగరేణిలో మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్, సూపర్వైజర్లను సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. గత కొన్ని నెలలుగా నిలిచి పోయినమెడికల్ బోర్డు ను నిర్వహించేందుకు, గత కొన్ని నెలలుగా మెడికల్ ఫిట్ ఐన కార్మికుల పిల్లలకు ఉద్యోగ నియామక పత్రాలు ఈ నెల 16న కొత్తగూడెం లో ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఆయన తెలిపారు. 150 మస్టర్ల సర్క్యులర్ ను అమలు చేయడంలో కార్మికుల పై ఒత్తిడి చేయమని , డిస్మిస్ ఐన కార్మికులకు ఒక సారి అవకాశం ఇచ్చేందుకు, సీనియర్ మైనింగ్ స్టాప్ కు ఏ గ్రేడ్ లో ఉన్న వారికి ఎగ్జిక్యూటివ్ గా ఈవన్ గ్రేడ్ ప్రమోషన్ ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, వైవీరావు, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్ తో పాటు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉన్నాయి. హైదరాబాద్‌లో తాము ఆ ట్రెండ్‌ను మార్చాలనుకుంటున్నాం. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతాం. 30 వేల ఎకరాల్లో ‘ఫ్యూచర్ సిటీ’, మూసీ పునరుజ్జీవనం, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టులు చేపట్టాం.

- యూఎస్ ఇండియా సమ్మిట్‌లో సీఎం రేవంత్

ప్రాంతీయం

ఆసక్తికరం 'అర్బన్ బ్యాంక్' ఎలక్షన్

- వైస్ చైర్మన్ గిరిపై 'బండి' చూపు
- కోర్టు పోరాటం నుంచి కుర్చీ దాకా 'బండి'ప్రయాస
- కరీంనగర్‌లో వైస్ చైర్మన్ కుర్చీ కోసం పోటీ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ నవంబర్ 13: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్ పాలక మండలి ఎన్నికలు ముగిసి వారం గడుస్తున్నా, వైస్ చైర్మన్ ఎవరు అనే ప్రశ్న మాత్రం ఇంకా తేలలేదు. పాలక మండలి ఎన్నికల్లో గెలిచిన సభ్యులంతా తమతమ రాజకీయ లెక్కలు వేసుకుంటూ, ఈ కీలకమైన స్థానంపై గట్టి పావులు కదుతున్నారు. ప్రస్తుతం వైస్ చైర్మన్ కుర్చీ చుట్టూ జరుగుతున్న ఆటలు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికర మలుపు తిరుగుతున్నాయి. కరీంనగర్‌లో అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ స్థానం ఇప్పుడు జిల్లాలోని అత్యంత ప్రతిష్ఠాత్మక స్థానాల్లో ఒకటిగా మారింది. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ స్థాయి కంటే ఎక్కువ ప్రాధాన్యత ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ పోస్ట్ కోసం కేవలం అధికార కాంగ్రెస్ నాయకులే కాకుండా, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కూడా తమ వర్గాలను చురుగ్గా రంగంలోకి దింపుతున్నారు.

కోర్టు పోరాటం నుంచి రాజకీయ కుర్చీ దాకా

ఈ మొత్తం ప్రక్రియలో కేంద్ర పాత్రధారిగా బండి ప్రకాష్ వెలుగులోకి వచ్చారు. ఆయన అర్బన్ బ్యాంక్ మాజీ పాలక మండలి అనర్హుల చేతుల్లో ఉందని పేర్కొంటూ హైకోర్టు ద్వారం తట్టారు. ఆ మండలిలో పీఏసీ చైర్మన్ విలాస్ రెడ్డి, మరికొందరు సభ్యులు ఉన్నందున, వారు అర్హులు కాదని వాదించారు. బండి ప్రకాష్ దావా వేసిన తరువాత నెలల తరబడి న్యాయపోరాటం సాగింది. ఆయన కోర్టు చుట్టూ తిరుగుతూ సుమారు ₹4.50 లక్షల వరకు వ్యయ పడ్డారని తెలుస్తోంది. చివరికి హైకోర్టు ఆయన వాదనను సమర్థిస్తూ, పాత పాలక మండలిని రద్దు చేసి, వెంటనే కొత్త ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.కోర్టు తీర్పు వెలువడిన తర్వాత ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయగా, ఇటీవలే అర్బన్ బ్యాంక్‌కి ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో బండి ప్రకాష్ తిరిగి గెలిచి పాలక మండలి సభ్యుడయ్యారు.

ఇప్పుడు వైస్ చైర్మన్ కుర్చీపై బండి దృష్టి

తాజా పరిణామాలతో బండి ప్రకాష్ ఇప్పుడు వైస్ చైర్మన్ పదవి తనదే కావాలని పట్టుబడుతున్నారు. తన న్యాయపోరాటం వల్లే ఎన్నికలు జరిగాయని, బ్యాంక్ పాలనలో కొత్త మార్పులు సాధ్యమయ్యాయని ఆయన వాదన. అందువల్ల తనకు ఆ స్థానానికి న్యాయమైన హక్కు ఉందని భావిస్తున్నారు. కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంక్‌లో మొత్తం 9,370 ఓట్లు ఉండగా, పాలక మండలిలో 12 మంది డైరెక్టర్లు ఉన్నారు — అందులో 9 మంది జనరల్, 2 మహిళలు, ఒకరు ఎస్సీ వర్గానికి చెందినవారు. ఈ 12 మందిలో మెజారిటీ బండి ప్రకాష్ వైపు మొగ్గు చూపుతున్నారని అంతర్గత సమాచారం చెబుతోంది. అయితే, మరో వర్గం మాత్రం ఆయన వైస్ చైర్మన్‌గా రావడాన్ని వ్యతిరేకిస్తోంది. "కోర్టు కేసు వేశాడు కానీ ఇప్పుడు ఆ పోరాటాన్ని తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాడు" అనే ఆరోపణలు బండి వ్యతిరేక వర్గం నుంచి వినిపిస్తున్నాయి.

మాజీ పాలక మండలిపై ప్రతీకార రాజకీయం?

బండి ప్రకాష్ చేసిన కోర్టు పోరాటం వాస్తవానికి ప్రజాస్వామ్య పరిరక్షణకోసమా, లేక వైస్ చైర్మన్ కుర్చీ కోసం వేసిన ముందస్తు పావులా అనే సందేహాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గత పాలక మండలిని రద్దు చేయించుకున్న ఆయన, ఇప్పుడు అదే స్థానాన్ని అందుకోవాలని ప్రయత్నించడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ఇక ఈ వ్యవహారం చివరికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి చేరింది. ఆయన మధ్యవర్తిత్వంతోనే చివరి నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం.కరీంనగర్ అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ పదవి చుట్టూ నెలకొన్న ఈ రాజకీయం స్థానిక స్థాయిలోనే కాదు, రాష్ట్రస్థాయిలోనూ చర్చనీయాంశమైంది. బండి ప్రకాష్ న్యాయపోరాటం ఫలితంగా ఎన్నికలు జరిగాయి. కానీ ఆ ఫలితం చివరికి ఆయన రాజకీయ ఆశయాలను తీర్చుతుందా లేదా అనేది చూడాలి. చివరిగా అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ ఎవరు అన్నదే కరీంనగర్ రాజకీయ వాతావరణాన్ని నిర్ణయించే అంశమవుతోంది.

మహాజాతరకు సర్వం సిద్ధం

- మేడారం జాతరకు 3,800 బస్సులు
- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 13: తెలంగాణలో రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే మేడారం మహాజాతరకు కోటిన్నర మందికి పైగా భక్తులు తరలి వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక.. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చి వనదేవతలకు మొక్కులు సమర్పించుకుంటారు. ఈ నాలుగు రోజులు మేడారం జన సంద్రం అవుతుంది. దక్షిణాది కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరకు సమయం ఆసన్నమవు తోంది. వచ్చే సంవత్సరం అనగా 2026, జనవరి 28 నుంచి 31వరకు మేడారం జాతర జరగనుంది. ఈ క్రమంలో తెలంగాణ లోని రేవంత్ రెడ్డి,సర్కార్ మేడారం జాతర కోసం సర్వ సిద్ధం చేస్తోంది. రోడ్ల అభివృద్ధి, భక్తులకు కావాల్సిన వసతులు కల్పించేందుకు ఇప్పటికే భారీగా నిధులు విడుదల చేసింది. భక్తుల కోసం ఏకంగా 3,800 బస్సులను నడపనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈక్రమం లో గురువారం సచివాలయంలో ఆర్టీసీ ఉన్నంత అధికారులతో తాజాగా నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే వరంగల్ ఆర్ఎండీ, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు మరి కొందరు ఆర్టీసీ సిబ్బంది, సివిల్ ఇంజనీర్లతో కలిసి మేడారంలో పర్యటించారు.

నియోజకవర్గాన్ని వీడి ఉండడం ఇదే ఫస్ట్

- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ (ధర్మపురి) నవంబర్ 13: కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపు కోసం జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని సోమాజిగూడ డివిజన్ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుతో కలసి చేపట్టినట్లు ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ కారణంగా "నా ప్రజా జీవితంలో, నా నియోజకవర్గాన్ని 12 రోజుల పాటు వదిలి ఉండడం ఇదే మొదటిసారి. నా మనసంతా నా ప్రజల దగ్గరే ఉందనీ తన మనసులో మాటను ఆయన వెలిబుచ్చారు.. జూబ్లీహిల్స్ ఎన్నికలు పూర్తికాగానే నా నియోజకవర్గ ప్రజలను కలవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది," అని మంత్రి గారు భావోద్వేగంతో వెల్లడిరచారు. గురువారం ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని దర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరంమీడియాతో మాట్లాడుతూ,"ధర్మపురి దేవాలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మా బహుజన బీసీ బిడ్డ నవీన్ యాదవ్ విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.పోలింగ్‌కు రెండు రోజుల ముందే బీఆర్ఎస్ పార్టీ చేతులు ఎత్తేసింది," అని ఎద్దేవా చేశారు.

పేదల ఆత్మగౌరానికి చిహ్నంగా

ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

- 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం
- రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్ (పెద్దపల్లి) నవంబర్ 13: పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో పర్యటించి పూర్తయిన 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి దఫా లోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ సరఫరా, ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. సోమనపల్లి వద్ద 200 కోట్లతో చేపట్టిన యంగ్ ఇండియా గురుకుల పాఠశాల పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో రైతులు తాళ్ళ కట్టింగ్ తో ఇబ్బందులు పడితే మన ప్రజా ప్రభుత్వం కట్టింగ్ కు స్వస్తి పలికి సన్న రకం వడ్లకు క్వింటాళ్ల 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. 25 లక్షల 65 వేల మంది రైతులకు 20 వేల 681 కోట్ల రూపాయల 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసామని అన్నారు. వానాకాలం పంటలో సన్న రకం పండిరచిన ధాన్యానికి 1800 కోట్ల బోనస్ అందించామని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అడవి సోమనపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో నేడు 40 గృహ ప్రవేశాలు మంత్రి చేతుల మీదుగా జరపడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశ పెట్టిందని కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి మేరకు ప్రతి సోమవారం నిధులు చెల్లించడం జరుగుతుందని అన్నారు.అనంతరం అడవి సోమనపల్లి గ్రామంలో 3 కోట్ల 5 లక్షలతో నిర్మించనున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ రాజేశ్వరరావు, మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

హుస్నాబాద్ కోర్టు ఎదుట

న్యాయవాదుల ధర్నా

- న్యాయమూర్తి పై దాడి ఘటనపై నిరసన

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 13: నిర్మల్ కోర్టు సీనియర్ న్యాయవాది అనిల్ కుమార్ పై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు ధర్నా చేపట్టారు. చట్టాన్ని రక్షించవలసిన పోలీసులే చట్టాన్ని చేతిలోకి తీసుకొని న్యాయవాదిపై దాడి చేయడం దారుణమని న్యాయవాదులు అన్నారు. రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించిన న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- హుస్నాబాద్ సీఐ కొండ్ర శీను

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 13: హుస్నాబాద్ పట్టణంలోని వాణిజ్య వర్తక వ్యాపారులు దుకాణ సముదాయాల ముందు వాహనాలు నిలపనీయకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీను వ్యాపారస్తులకు సూచించారు. గురువారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని వ్యాపారులతో ట్రాఫిక్ అంతరాయం పై మాట్లాడారు. వాహనదారులు ఇష్టానుసారంగా దుకాణాల ఎదుట నిలపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో పాటు ఇతరులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ప్రతి దుకాణం ముందు రెండు సీసీ కెమెరాలు దుకాణం ముందు, రోడ్డు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. అంబేద్కర్ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తాలలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్న దృష్ట్యా ఆర్టీసీ బస్సుల నిలిపివేతపై ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బస్సులను ఆపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా నిలవాలి

- బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి
- బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి
- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవంబర్ - 13: బాల్య వివాహాల రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన పేర్కొన్నారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, అమలవుతున్న పథకాలు, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాల్య వివాహాలు, బాల కార్మికుల కేసులు, వారి హక్కుల పరిరక్షణ తీసుకుంటున్న చర్యలు, వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన మాట్లాడారు. బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిదేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మికుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారిని సమీప విద్యాలయాల్లో చేర్పించాలని, అనాథ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లలను రెసిడెన్షియల్ స్కూళ్లలో జాయిన్ చేయాలని సూచించారు. విద్యాలయాలు, హాస్టల్‌లో గుడ్ టచ్..బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై, 1098 హెల్ప్ లైన్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులను విద్యా ద్వారా సామాజికంగా, ఆర్థికంగా రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించాలని, సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని, చిల్డ్రన్ హోమ్ పనులు పూర్తి చేయిస్తామని, పిల్లల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీ వీహెచ్ఓ రవీందర్ రెడ్డి, డీఈఓ వినోద్ కుమార్, డీఎస్పీ చంద్ర శేఖర్ రెడ్డి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, జీసీడీఓ పద్మజ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 13: హస్నాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో ఘనంగా పిల్లలు, తల్లిదండ్రులతో ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికీ, శారీరక ధృడత్యానికి ఉపయోగపడ తాయన్నారు. పిల్లలకు మొబైల్ వాడకం,ఆన్లైన్ గేమ్స్ ఆడడం వలన పిల్లల శరీర అవయవాలు కండ్లు ,మెదడు దెబ్బతిని మానసికంగా ఎదగలేరని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.రాము మాట్లాడుతూ పిల్లలలో మానసిక ధృడత్వం, పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందిపడేస్తాయని, జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని, భౌతిక ఆటలు పిల్లలకు భవిష్యతులో ఉపయోగపడుతాయని , పిల్లలకు మార్గదర్శకత్వాన్ని నిర్దేశిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల సిద్దిపేట్ జోన్ ఏజీఎం మధుసూదన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి కశ్మీరీ ముస్లిం టెర్రరిస్టు కాదు. అమాయకులను క్రూరంగా చంపడాన్ని ఏ మతమూ సమర్థించదు. కశ్మీర్‌లో శాంతి, సోదరభావాన్ని నాశనం చేసేవారు కొందరు ఉంటారు. ఢిల్లీ బ్లాస్ట్ కారకులను కఠినంగా శిక్షించాలి. అమాయకులను వదిలేయాలి. ఓ డాక్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాక దర్యాప్తు ఎందుకు చేయలేదు.

-జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా

ప్రాంతీయం

విద్యార్థుల సృజనాత్మకత వెలికితీయడమే
యువజన ఉత్సవాల లక్ష్యం

- **నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్13 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ కు ఎన్సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, జీవితంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువజన ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ గుణాలు, బృందాత్మకత పెంపొందుతాయని తెలిపారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈసారి మరింత ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యం – అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు, సాంస్కృతిక పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యమైందని తెలిపారు. ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంలో, ఆత్మవిశ్వాసం పెంచడంలో దోహదపడతాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో ఈ యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. వివేకానంద భారత యువతకు ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ప్రభుత్వ పథకం
అర్హులైన పేదలకు అందిస్తాం

- **కలెక్టర్ అభిలాష అభినవ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 13 : ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు, పథకాల అమలుపై సంబంధిత అధికారులు అందరితో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నిటిని అర్హులైన నిరుపేదలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు మార్గనిర్దేశం చేస్తున్నట్లు వివరించారు. ఏ కారణాల చేతనైనా అభివృద్ధి పనులు ఆగితే, వెంటనే తమ దృష్టికి తేవాలని తెలిపారు.

పేదల అభ్యున్నతి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి పేదలకు అభ్యున్నతికి తోడ్పడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పథకాలన్నీ సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎట్టి పరిస్థితుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని అన్నారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ నాగినిభాను, ఆర్డీఓ రత్నకళ్యాణి, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీసీల ధర్మ పోరాట దీక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 13 : జిల్లాలో బీసీల ధర్మ పోరాట దీక్ష లు కొనసాగుతున్నాయి. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల ను కల్పించాలనని రాష్ట్ర బీసీ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ "అష్టాదశ" కార్యక్రమాలలో భాగంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో మండల, జిల్లా కేంద్రాలలో బీసీల ధర్మ పోరాట దీక్ష కార్యక్రమనికి పిలుపునిచ్చారు. అందులో భాగంగా గురువారం నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్లో పోరాట దీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు వెంటనే కల్పించాలని లేకపోతే బీసీ ఉద్యమాన్ని ఇంకా పెద్ద ఎత్తున తీసుకెళ్తామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వెంటనే అమలుపరిచి తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ 56 శాతం బీసీల జనాభా ఉన్నాగాని ఈ రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం ఇచ్చినా దానికి సంతోషపడ్డ కొందరు అగ్రవర్ణాల దురహంకాలు కేసులు వేసి రిజర్వేషన్లను ఆపివేయడం అన్యాయం అన్నారు. వెంటనే ఈ కేసులను వెనుకకు తీసుకొవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఆకుల ప్రసాద్ మాట్లాడుతూ బీసీల్లో చైతన్యం వచ్చిందని ఇక బీసీలను ఆపేశక్తి ఏది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దర్శనం దేవేందర్, కరిపె రవిందర్, మాడవేడి వినోద్ కుమార్, కొయ్యడ శంకర్, శ్రీలత, చంద్రమోహన్, బగ్గలి అజయ్, చంద్ర కాంత్, వాసం జయ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి ప్రణాళికలపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష

- **ఒక్కో డివిజన్ వారీగా పురోగతిని సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం**

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 13 : నిజామాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. వివిధ విభాగాల అధికారులతో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే వార్డు ఆఫీసర్లతో క్రమం తప్పకుండా సమావేశమవుతూ నగర పురోభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో నగర పాలక సంస్థ పనితీరుపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో డివిజన్ వారీగా నెలకొని ఉన్న క్షేత్రస్థాయి పరిస్థితులను, సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగతం చేసుకుంటూ, అభివృద్ధి ప్రణాళికలపై కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ఇదివరకటి సమావేశంలో నిర్దేశించిన ప్రగతి పనుల పురోగతిని సమీక్షించారు. ఖాళీ స్థలాల పరిరక్షణ, వన మహోత్సవం, పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి సంరక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలని, ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించేలా ఖాళీ స్థలాల్లో విరివిరిగా మొక్కలు నాటించాలని అన్నారు. మీడియన్, అవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని, ప్రతి మొక్క సంరక్షించబడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రతి రోజు చెత్త సేకరణ ఆటో ట్రాలీలు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. అవకాశం ఉన్న చోట డ్రైనేజీలను శుభ్రపరిచేందుకు జె.సీ.బీలను వినియోగించాలని సూచించారు. శానిటేషన్ సిబ్బంది అందరూ విధులకు హాజరయ్యేలా, అన్ని డివిజన్లలో శానిటేషన్ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి నివాస ప్రాంతంలో పచ్చదనం, పరిశుభ్రత ఉట్టిపడేలా చొరవ చూపాలని అన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని అన్నారు. అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఇప్పటికే మంజూరీలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. అవసరమైన వారికి మెప్మా ద్వారా విరివిరిగా రుణాలు ఇప్పించాలన్నారు. తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన ప్రగతి కనిపించాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఈ.ఈ నివర్తి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబు, వివిధ విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి2025 రాజ్యాంగ విరుద్ధం

- **సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు**
- **శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సెమినార్**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 13 : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన లేబర్ పాలసీ శ్రమశక్తి నీతి2025 రాజ్యాంగ విరుద్ధమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రమశక్తి నీతి2025 సెమినార్ కి చుక్క రాములు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాములు మాట్లాడుతూ ఈ లేబర్ పాలసీతో కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర జరుగుతున్నదని, సమిష్టి బేరసారాల హక్కును హరించి, ఐఎల్ ఓ ను బైపాస్ చేసి కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఈ పాలసీ తెచ్చారని ఆరోపించారు. దేశంలో కార్మికశక్తిని ఐక్యం కానీయకుండా కార్పొరేట్ల రాజ్యంలా మార్చడానికి ఈ శ్రమశక్తి నీతి 2025 ఉపయోగపడుతుందని, మన రాజ్యాంగంలో కార్మికులకు కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమకు గౌరవం వంటి విలువలకు పూర్తి విరుద్ధమని, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి మూల కారణమైన కార్మికవర్గ హక్కులపై యూనియన్ల తో చర్చించకుండా ఏకపక్షంగా అమలుచేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ పాలసీని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని, ఈ అంశంపై కార్మికవర్గమంతా ఐక్యమై పోరాటాలకు సిద్ధంకావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పి. పాండురంగా రెడ్డి, ఎమ్. మనోహర్, ఎ. వీరారావు, ఎమ్. సత్తిబాబు, వివిధ కమిటీల సభ్యులు, మాజీ ఆఫీస్ బేరర్స్, మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

గౌడ కులస్తుల భూమిని కబ్జా చేస్తే తీవ్ర పరిణామాలు

- **మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్**

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 13: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో మోకుదెబ్బ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ పెట్టడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని బొమ్మెన గ్రామంలో సర్వే నెంబర్ 59 లో 1984 లో అప్పటి నందమూరి తారక రామారావు గారు గౌడ కులస్తులకు ఐదు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగింది అప్పటి నుండి గౌడ కులస్తులు ఐదు ఎకరాల భూమిలో తాటి ఈత చెట్లను పెట్టుకుని కులవృత్తిని నిర్వహించడం జరుగుతుంది నేటి వరకు గౌడ కులస్తుల పేరిట రిజిస్ట్రేషన్ అయి ఉంది అందులో దీనిపైన అక్కడి వ్యవసాయ ట్రాన్స్ఫార్మర్ కమిటీ పేరిట కోన్ రెడ్డి లింగారెడ్డి, పిడుగు ఎల్లారెడ్డి, పినుగు అశోక్ రెడ్డి కలిసి బలవంతంగా కబ్జ చేయాలనీ చూస్తున్నారు. దీనిపైన పలుమార్లు స్థానిక మండల తాసిల్దార్ గారికి స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గారికి జిల్లా కలెక్టర్ గార్లకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు దీన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ లు తీవ్రంగా ఖండిస్తూ గౌడ కులస్తుల భూమిని కబ్జ చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి ఉంటుందని ఇటీవల గౌడ కులస్తులపై వీడిసి కమిటీ పేరిట దాడులకు పాల్పడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి భూమిని ఎలాంటి పేపర్స్ లేకుండా బలవంతంగా కబ్జాలు చేస్తూ గౌడ కులస్తులపైన భౌతిక దాడులకు పాల్పడుతున్నరు అన్నారు. ఈలాంటి కబ్జల పైన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కబ్జాకు బాధ్యులైనటువంటి వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవీరి నర్సాగౌడ్ మోగ్దెబ్బ రాసిన నాయకులు పడాల రాజేందర్ గౌడ్ తీగల వెంకట్ గౌడ్ కొండ బాలా గౌడ్ యాగళ్ల దశ గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర శ్రీనివాస్ గౌడ్ బొమ్మెన గ్రామ గౌడ సోదరులు ముంజ లక్ష్మయ్య గౌడ్ మామిడిపల్లి రామ కృష్ణ గౌడ్ కేడియం బాబాగౌడ్ పంజాల అంజయ్య గౌడ్ పంజాల గంగాధర్ గౌడ్ మామిడిపల్లి లక్ష్మీనారాయణ గౌడ్ ముంజ రామ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే వరకు పోరాటం ఆగదు

- **హుస్నాబాద్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష**

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 13: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలని, ఆ సవరణను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ జేఏసీ పిలుపు మేరకు గురువారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేయాల్సినంత చేసి కేంద్రానికి బిల్లు పంపిందని, ఇకపై పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని తెలిపారు. బీసీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందా, లేక బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందా అనేది కేంద్రం తీరు తేలుస్తుందన్నారు. అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్లపై ఒత్తిడి తెచ్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ బిల్లును ఆమోదించి, రిజర్వేషన్లను రాజ్యాంగ రక్షణ కల్పించాలన్నారు. బీసీ జేఏసీ పిలుపునిచ్చిన ఆందోళనకు బీసీ సమాజం, ఇతర సామాజిక కులాలు విస్తృతంగా స్పందించి ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ దీక్షలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, బీఎస్పీ పార్టీలు, జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గం, మాలమహానాడు, జనజాగృతి కళాసమితి, వివిధ బీసీ కుల సంఘాలు పాల్గొన్నాయి. దీక్షకు బీసీ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షత వహించారు. దీక్షలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్, మాజీ ఎంఎప్పీ ఆకుల వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్వర్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, ఓయూ జేఏసీ నాయకులు గంపల శ్రీనివాస్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మెతుకు కొమురయ్య, మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ, నాయిని రజిత, కోడూరి శ్రీదేవి, పెరుమాండ్ల నర్సాగౌడ్, గట్టు రాములు, కోడం ప్రభాకర్, మార్క అనిల్ గౌడ్, లుపెరుక భాగ్యరెడ్డి, వల్లపు రాజు, పున్న సది, భూక్య సరోజన, బూర వెంకన్న, ముక్కెర సంపత్, బొంగోని శ్రీనివాస్ గౌడ్, అలువోజు రవీందర్, వడ్డేపల్లి వెంకటరమణ, కోమటి సత్యనారాయణ, వెన్న రాజు, నోముల బాలయ్య, పచ్చిమట్ల శ్రీకాంత్, బొల్లి శ్రీనివాస్, కేశవేణి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలయ్య, పొన్నం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

షమీ లాంటి బౌలర్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఆయన్ను ఎందుకు సెలక్ట్ చేయలేదు, ఫ్యూచర్‌లో చేస్తారా అనే ప్రశ్నలకు తనకంటే సెలక్టర్లే బెటర్‌గా సమాధానం ఇవ్వగలరు. ప్రస్తుతమున్న బౌలర్లు చాలా బాగా రాణిస్తున్నారు. సౌత్‌ఆఫ్రికాతో జరగనున్న తొలి టెస్టులో ఆల్‌రౌండర్ లేదా ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించే విషయంపై రేపే నిర్ణయం తీసుకుంటాం.
- టీం ఇండియా టెస్ట్ కెప్టెన్ గిల్

మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు

- పసిడి రూ. 3 వేలు, వెండి రూ.10 వేలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, నవంబర్ 13 : బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ నగరంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజులో రూ. 3 వేలకు పైగా పెరిగి రూ. 1,31,500కు చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,17,000 పైన పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజులో రూ. 10 వేలకు పైగా పెరిగి రూ. 1,71,300కు చేరుకుంది. ఇటీవలి కాలంలో దాదాపు స్థిరంగా ఉన్న బంగారం ధరలు, తాజాగా మరోసారి పెరుగుతూ ఉండడం గమనార్హం.అంతర్జాతీయ మార్కెట్ లో ఔన్సు బంగారం ధర 4,200 డాలర్లను దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి ఔన్సు ధర 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది.అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్ డౌన్ ముగియడంతో ఆర్థిక కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఆర్థిక గణాంకాలు వెలువడటంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉంది. ఈ కారణంగానే బంగారం ధరలు పెరుగుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

విశ్వ వీక్షణం

ఫిరాయింపు ఎమ్మెల్యేపై అనర్హత వేటు

- కోల్ కతా హైకోర్టు సంచలన తీర్పు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 13 : ఫిరాయింపు ఎమ్మెల్యే మీద కోల్ కతా హైకోర్టు అనర్హత వేటు వేసింది. బీజేపీ టికెట్ మీద ఎమ్మెల్యేగా గెలిచిన ముకుల్ రాయ్ తరువాత టీఎంసీలో చేరారు. దీనిపై బీజేపీ నాయకులు వేసిన అనర్హత పిటిషన్ మీద హైకోర్టు విచారణ జరిపింది. ముకుల్ రాయ్ ని ఎమ్మెల్యే పదవి నుండి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఈ తీర్పును కోర్టు ప్రకటించింది. 2021 అసెంబ్లీ ఎన్నికలలో కృష్ణానగర్ ఉత్తర్ సీటు నుంచి బీజేపీ టికెట్ పై ముకుల్ రాయ్ ఎమ్మెల్యేగా గెలిచిరు. ఎన్నికలు ముగిసిన ఒక నెల రోజులలోపే తృణమూల్ కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఆయనపై అనర్హతా వేటు వేయాలని బీజేపీ నేత సువేందు అధికారి స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. రెండేండ్ల విచారణ తర్వాత వేటు వేయాల్సిన అవసరం లేదని స్పీకర్ తీర్పు చెప్పారు. దీంతో సువేందు అధికారి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు డివిజన్ బెంచ్ ముకుల్ ను అనర్హుడిగా ప్రకటించడమే కాకుండా, స్పీకర్ బిమన్ బెనర్జీ తీర్పును కూడా రద్దు చేసింది. ముకుల్ రాయ్ టీఎంసీలో సీనియర్ నేత. మాజీ రైల్వే మంత్రి, రాజ్యసభ సభ్యుడిగా టీఎంసీ నుంచి పనిచేసిన ఆయన, 2021 ఎన్నికలకు ముందు బీజేపీలో ఎమ్మెల్యేగా చేరి గెలిచారు. బీజేపీ అధికారంలోకి రాలేదు. దాంతో ఎన్నికలు ముగియగానే టీఎంసీలో చేరారు. ఆ తర్వాత ఆయనను మమతా బెర్జీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా నియమితులయ్యారు.

'మా వంశంలో ఎవరికీ మధుమేహం(షుగర్) లేదు. మేము కష్టపడేవాళ్లం. మాలాంటి వాళ్లకు రాదు' అనే మాటలు చెల్లవిక.. కారణం అది ఇప్పుడు సాధారణమైంది. ప్రతి ఇద్దరిలో ఒకరు మధుమేహం బారిన పడుతున్నారు.

ప్రపంచంలో ప్రాణాలు తీస్తున్న ప్రమాదకర వ్యాధుల జాబితాలో మధుమేహం (డయాబెటిస్) తొమ్మిదో స్థానంలో ఉంది..

భారత్‌లో ప్రతి ఇద్దరిలో ఒకరికి రక్తంలో అధిక చక్కెర స్థాయి

మధుమేహం (డయాబెటిస్).. దీనికి సైలెంట్ కిల్లర్ అనే పేరుంది. ఈ వ్యాధి బారిన పడ్డవారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 83 కోట్లు దాటిందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చెబుతోంది. అయితే మన దేశంలో అధికంగా మధుమేహ రోగులుండటం ఆందోళన కలిగించే అంశం. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం 20 ఏళ్లకు పైబడిన వారిలో 10 కోట్ల మందికి పైగా డయాబెటిస్ పేషెంట్లు ఉన్నట్టు అంచనా.మరో 13.6 కోట్ల మందికి మధుమేహం ముప్పు పొంచి ఉంది. అయితే చాలామందికి తమకు వచ్చే ప్రమాదం గురించి తెలియడం లేదు. అంతేకాదు డయాబెటిస్ ప్రాబల్యం విషయంలో భారతదేశం ప్రపంచ సగటు కంటే చాలా ముందుండడం ఆందోళన కలిగిస్తోంది. పరిశోధకులు 2021 నుంచి 2025 మధ్య కాలానికి చెందిన 40 లక్షల వైద్య నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ విశ్లేషణలో భాగంగా జరిపిన హెచ్‌బీఏ1సీ పరీక్ష ఫలితాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ఫలితాల ప్రకారం, ప్రతి ఇద్దరిలో ఒకరి రక్తంలో చక్కెర స్థాయిలు డయాబెటిస్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. అలాగే, ప్రతి నలుగురిలో కనీసం ఒకరు ప్రీడయాబెటిస్ (మధుమేహం వచ్చే ముందు దశ) కలిగి ఉన్నారని వారి అధ్యయనం తేల్చింది. గత మూడు నెలల సగటు రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకోవడానికి హెచ్‌బీఏ1సీ పరీక్షను ప్రామాణికంగా ఉపయోగిస్తారు. వైద్య నిపుణుల ప్రకారం, ఈ పరీక్షలో రీడింగ్ 5.7 శాతం కంటే తక్కువగా ఉంటే సాధారణమని, అదే 6.5 శాతం దాటితే డయాబెటిస్‌గా నిర్ధారిస్తారు. ఆందోళన కలిగించే మరో విషయం ఏమిటంటే, ఈ సమస్య కేవలం పట్టణాలకే పరిమితం కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లోనూ గ్లూకోజ్ స్థాయిలు పెరిగినట్లు ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఇది దేశ ఆరోగ్య భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంటుంది...

డయాబెటిస్ ఉన్న వ్యక్తులలో..నలుగురిలో ఒకరికి అసాధారణ రీతిలో థైరాయిడ్ (హైపోథైరాయిడిజం)

- ముగ్గురిలో ఒకరికి కాలేయ పనితీరులో సమస్యలు
- దాదాపు సగం మందికి ఏదో ఒక రకమైన మూత్రపిండాల బలహీనత
- సుమారు 90% మందికి అసాధారణ లిపిడ్ ప్రొఫైల్స్ ఉంటాయి.

చిన్నవయస్సు వారిపైనా కూడ మధుమేహం ప్రభావం

- డిజిటల్ హెల్త్‌కేర్ ప్లాట్‌ఫామ్ ఫార్మ్‌ఈజీ అధ్యయనం ప్రకారం భారత్లో ఇద్దరిలో ఒకరికి రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నట్టు నిర్ధారణ అయింది. 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 40 లక్షలకు పైగా రోగ నిర్ధారణ నివేదికలు, 1.9 కోట్ల ఔషధ ఆర్డర్లను కంపెనీ విశ్లేషించింది. 'డయాబెటిస్: ది సైలెంట్ కిల్లర్ స్వీపింగ్ ఎక్రాస్ ఇండియా 'పేరుతో రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. 28.4% మందికి మధుమేహం నిర్ధారణ అయింది.
- 27.5% మందికి ముప్పు పొంచి ఉంది. అంటే వీరు టైప్2 డయాబెటిస్ బారిన పడే అవకాశం ఉంది. ఈ వ్యాధి వృద్ధులను మాత్రమే కాకుండా చిన్న వయస్సు వారిని కూడా ఎక్కువగా ప్రభావితం చేస్తోంది. రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండడం 90% మందిలో కాలేయం, లిపిడ్ (కొవ్వులు, నూనె, హార్మోన్లు), గుండె, థైరాయిడ్ సమస్యలకు దారితీసిందని నివేదిక తెలిపింది.

నేడు వరల్డ్ డయాబెటిస్ డే

- దేశంలో విస్తరిస్తున్న డయాబెటిస్ మహమ్మారి
- 40 లక్షల మెడికల్ రిపోర్టుల విశ్లేషణలో వెల్లడి
- ప్రతి ఇద్దరు భారతీయుల్లో ఒకరికి అధిక షుగర్
- ప్రతి నలుగురిలో ఒకరు ప్రీ-డయాబెటిస్ దశలో
- హెచ్‌బీఏ1సీ పరీక్షల ఆధారంగా తేలిన వాస్తవాలు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే తీవ్రత..

డయాబెటిస్ ను పూర్తిగా తగ్గించలేము కానీ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

డయాబెటిస్ అనేది జీవితకాల (దీర్ఘకాలిక) వ్యాధి, దీనిలో రక్తంలో చక్కెర (గ్లూకోజ్) అధిక స్థాయిలో ఉంటుంది. మధుమేహం అత్యంత సాధారణ రూపం టైప్ 2 మధుమేహం.. అయితే.. తప్పుడు ఆహారపు అలవాట్లు, చెడు జీవనశైలి కారణంగా ప్రజలు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అయితే, మధుమేహం నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి.

మధుమేహం రెండు రకాలుగా ఉంటుంది .

ఒకటి చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల వచ్చేది టైప్ 2.. మరొకటి జన్యుపరమైనమైనది అదే టైప్ 1.టైప్ 1 పుట్టినప్పుడు సంభవించవచ్చు. అటువంటి పరిస్థితిలో, నివారణ అవకాశాలు తక్కువగా ఉంటాయి. కానీ మీరు టైప్ 2 మధుమేహాన్ని నివారించవచ్చు. టైప్ 2 డయాబెటిస్‌లో, మీ శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించదు దీనిని ఇన్సులిన్ నిరోధకత అంటారు. మొదట, మీ బీటా కణాలు దానిని భర్తీ చేయడానికి అదనపు ఇన్సులిన్‌ను తయారు చేస్తాయి. కాలక్రమేణా, మీ క్లోమం మీ రక్తంలో గ్లూకోజ్‌ను సాధారణ స్థాయిలో ఉంచడానికి తగినంత ఇన్సులిన్‌ను తయారు చేయలేకపోతుంది.
దీని కోసం కొన్ని విషయాలను గుర్తుంచుకోవడం ముఖ్యం.. డైలీ ఈ రొటీన్ పాటిస్తే మధుమేహం నుంచి కాపాడుకోవచ్చు.. ముఖ్యంగా ప్రతి రోజు సమయానికి ఏడు గంటలు నిద్రపోవాలి, మానసిక ఆలోచనలను దూరంగా పెట్టాలి..
మీ వైద్యుడు చెప్పిన ప్రకారం మందులు కచ్చితంగా వేసుకోవాలి..

డా. కౌశల్ గోవర్ధన
7702417779
వైస్ చైర్మన్
శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదారాబాద్

5 కిలోమీటర్ల చురుకైన నడక..

మధుమేహాన్ని నివారించడానికి, మీరు చురుకుగా ఉండటం ముఖ్యం. ఇందుకోసం రోజూ కనీసం 5 కిలోమీటర్లు వేగంగా నడవండి. అంటే, కాలినడకన నడవాలి.. కానీ కొంచెం వేగంగా ఉండాలి. అందులో నడుస్తున్నప్పుడు ఊపిరి పీల్చుకున్నట్లు అనిపిస్తుంది. బ్రిస్క్ వాక్ చేయడం వల్ల శరీరంలోని షుగర్ లెవల్స్ ని కంట్రోల్ చేయడంలో చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది..

యోగా చేయండి..

వేగంగా నడిచిన తర్వాత కనీసం అరగంట పాటు యోగా చేయాలి. డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించే అనేక యోగా ఆసనాలు కూడా ఉన్నాయి..

మీ ఆహారం పట్ల శ్రద్ధ వహించండి..

డయాబెటిస్‌ను నివారించడానికి లేదా రాకుండా ఉండటానికి మీ ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. మీ ఆహారంలో తక్కువ కొవ్వు, పిండి పదార్థాలు, ఎక్కువ ప్రోటీన్లు ఉండాలి.. అంటే బంగాళాదుంపలు, పిండి, చక్కెర వంటి వాటిని తక్కువగా తీసుకోవాలి. ఖచ్చితంగా పప్పులు, కిడ్నీ బీన్స్, పండ్లు, ఆకుపచ్చ కూరగాయలను ఆహారంలో చేర్చండి...

గమనిక:

ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే.ఏవైనా సందేహాలు ఉంటే మీ వ్యక్తిగత వైద్యుని సంప్రదించండి

ఆల్ ఫళ్లా వర్సిటీకి 'న్యాక్' నోటీసులు

- తప్పుడు వివరాలు సమర్పించిందని ఆరోపణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 13 : ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు ఘటనలో అల్ ఫలా విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు వైద్యులు అనుమానితులుగా ఉండటంతో ఈ విశ్వవిద్యాలయం పేరు తెర మీదకు వచ్చింది. ఈ నేపథ్యంలోనే, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) ఈ విశ్వవిద్యాలయానికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అల్ ఫలా విశ్వవిద్యాలయం తమ వెబ్‌సైట్ లో గుర్తింపునకు సంబంధించి తప్పుడు సమాచారం పొందుపరిచినందుకు న్యాక్ ఈ చర్య తీసుకుంది.

న్యాక్ గుర్తింపు లేకుండా, లేదా అక్రిడేషన్ కోసం దరఖాస్తు చేసుకోకుండానే, అల్ ఫలా విశ్వవిద్యాలయం తమ కళాశాలకు గుర్తింపు ఉన్నట్లుగా వెబ్ సైట్‌లో బహిరంగంగా ప్రదర్శించిందని, ఇది పూర్తిగా తప్పని న్యాక్ తన నోటీసులో పేర్కొంది. ఈ చర్య ప్రజలను, ముఖ్యంగా తల్లిదండ్రులను, విద్యార్థులను తప్పుదారి పట్టించడమేనని తెలిపింది. హర్యానా ఫరీదాబాద్ జిల్లా, ధౌజ్ గ్రామంలో 76 ఎకరాలలో అల్ ఫలా విశ్వవిద్యాలయం విస్తరించి ఉంది. హర్యానా ప్రైవేటు యూనివర్సిటీల చట్టం కింద ఇది ఏర్పాటైంది. 1997లో ఇంజినీరింగ్ కాలేజీగా మొదలైన ఈ సంస్థ, 2013లో యూజీసీకి చెందిన న్యాక్ నుంచి 'ఏ' గ్రేడ్ అందుకుందని కొన్ని మీడియా కథనాలు పేర్కొన్నాయి.రాష్ట్రప్రభుత్వం 2014లో దీనికి విశ్వవిద్యాలయ హోదా కల్పించింది. ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 2019లో అల్ ఫలా మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. తమది గుర్తింపు పొందిన విద్యా సంస్థ అని విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రకటనలో కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలో న్యాక్ నుంచి నోటీసులు రావడం గమనార్హం.

కశ్మీర్ ముస్లింలంతా ఉగ్రవాదులు కారు

- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, శ్రీనగర్, నవంబర్ 13 : ఢిల్లీలో ఇటీవల జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు చెందినవారిపై, ముఖ్యంగా కశ్మీరీ ముస్లింలపై వివక్ష చూపించే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి కశ్మీరీ ముస్లిం ఉగ్రవాది కాదని, ప్రజలందరినీ ఒకే కోణంలో చూడవద్దని సూచించారు. కేవలం కొద్దిమంది చేసే తప్పులకు మొత్తం సమాజాన్ని నిందించడం సరికాదన్నారు. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన పేలుడులో 13 మంది మరణించగా, అనేక మంది గాయపడిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండించిన ఒమర్ అబ్దుల్లా, అమాయక ప్రజలను ఇంత క్రూరంగా చంపడాన్ని ఏ మతమూ సమర్థించదని అన్నారు.

గురువారం ఆయన జమ్మూలో విలేకరులతో మాట్లాడారు. 'శాంతి, సోదరభావాన్ని దెబ్బతీసేది కేవలం కొద్దిమంది మాత్రమే. మనం కశ్మీరీలందరినీ, ప్రతి కశ్మీరీ ముస్లింను ఉగ్రవాదిగా చూస్తే, ప్రజలను సరైన మార్గంలో నడిపించడం కష్టమవుతుంది' అని వివరించారు. ఈ పేలుడు వెనుక ఉన్న అసలైన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, విచారణ పేరుతో అమాయకులను వేధించవద్దని కోరారు. ఉగ్రవాద ఘటనలలో డాక్టర్ల వంటి చదువుకున్న వారు ఉండడం మీద మాట్లాడుతూ 'గతంలో మనం వర్సిటీ ప్రొఫెసర్లను ఇలాంటి కేసులలో చూడలేదా? చదువుకున్న వారు ఇలాంటి పనులలో పాల్గొనరని ఎవరు చెప్పారు? వారు కూడా పాల్గొంటున్నారు' అని అన్నారు.

పంజాబ్ లో శాంతి విఘాతానికి కుట్ర

- 10 మంది కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చండీఘర్, నవంబర్ 13 : పంజాబ్ లోని లూధియానా పోలీసులు ఐఎస్ఐ పాకిస్తాన్ మద్దతుతో గ్రెనేడ్ దాడి మాడ్యూల్‌ను ఛేదించారు. 10 మంది కీలక కార్యకర్తలను అరెస్టు చేశారు. వీరంతా విదేశాలలోని హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరిపారు. పంజాబ్ డీజీపీ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పంజాబ్ రాష్ట్ర శాంతికి భంగం కలిగించేందుకు పథకం పన్నారని ఆరోపించారు. నిందితులు మలేషియాలో ఉన్న ముగ్గురు ఆపరేటర్ల ద్వారా పాకిస్తాన్‌లోని హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ హ్యాండ్లర్లు వారికి హ్యాండ్ గ్రెనేడ్‌ను తీసుకొని డెలివరీ చేసే పనిని అప్పగించారు. రద్దీగా ఉండే ప్రదేశంలో గ్రెనేడ్ దాడి చేయడమే హ్యాండ్లర్ల లక్ష్యం. బుధవారం తెల్లవారుజామున, పంజాబ్ యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్ ఫోర్స్, బటాలా పోలీసుల సహకారంతో, ఆపరేషన్ ప్రారంభించింది. జగ్గు భగవాన్‌పురియా గ్యాంగ్‌లో చురుకైన సభ్యుడు గుర్లోవ్ సింగ్ అలియాస్ లవ్ రంధవాను అరెస్టు చేసింది. గుర్లోవ్ బటాలా నివాసి. అతని నుండి రెండు అధునాతన పిస్టళ్లు, మూడు మ్యాగజైన్‌లు, పదహారు లైవ్ కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. రెండు పోలీసు బృందాల ఉమ్మడి ప్రయత్నాలతో ఈ ఆపరేషన్ జరిగింది. ప్రాథమిక దర్యాప్తులో అనేక ముఖ్య విషయాలు వెల్లడయ్యాయి. గుర్లోవ్ సింగ్ విదేశాలలో ఉంటున్న తన హ్యాండ్లర్ అమృత్ దలం ఆదేశాల మేరకు వ్యవహరించేవాడు.



సౌతాఫ్రికాతో తొలి టెస్టుకు టీమిండియా సిద్ధం

- ఈడెన్ గార్డెన్ లో నేటి ఉదయం 9:30కు ప్రారంభం

సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు టీమిండియా సమాయత్తమైంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శుక్రవారం తొలి మ్యాచ్ కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ లో ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఇరు జట్ల క్రీడాకారులు గురువారం నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. దాదాపు ఆరేండ్ల తర్వాత కోల్‌కతాలో టెస్టు మ్యాచ్ జరగబోతోంది. ఈ మ్యాచ్ కోసం పేస్‌కు సహకరించే పిచ్‌ను సిద్ధం చేస్తున్నారని సమాచారం. అయితే, ఈ మ్యాచ్‌లో భారత్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగవచ్చు. యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నారు. సాయి సుదర్శన్, కెప్టెన్ శుభమన్ గిల్ వరుసగా ఆడుతారు. ప్రధాన వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్, మరో వికెట్ కీపర్, బ్యాటర్ గా ధ్రువ్ జురెల్ బరిలోకి దిగనున్నాడు. రవీంద్ర జడేజాకు తోడుగా అక్షర్ పటేల్ లేదా వాషింగ్టన్ సుందర్ ఆడవచ్చు. ప్రధాన స్పిన్నర్‌గా కుల్‌దీప్ యాదవ్ ఆడడం ఖాయమంటున్నారు. పేస్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ తుది జట్టులో ఉంటారు. కాగా, కొన్ని నెలలుగా బవుమా సారథ్యంలోని సౌతాఫ్రికా అద్భుతంగా ఆడుతోంది. ఇటీవల పాకిస్తాన్ జరిగిన టెస్టు సిరీస్‌ను సమం చేసింది. కెప్టెన్ బవుమా, ఎయిడెన్ మార్‌క్రమ్, రియాన్ రికెల్టన్, టోనీ డీ జోర్జి, స్టబ్స్, బ్రెవిస్, కైల్ వెరీన్ ముల్డర్‌తో కూడిన బ్యాటింగ్ బలంగా ఉంది. కేశవ్ మహారాజ్, ముత్తుస్వామి, హార్మర్‌తో స్పిన్ విభాగం పటిష్టంగా ఉంది. కగిసో రబాడా, మార్కో యాన్సెన్, కార్బిన్ బోష్‌తో పేస్ విభాగం బలంగా ఉంది. కాగా, ఉదయం 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్ స్పోర్ట్స్ బ్రాడ్‌కాస్టింగ్ ఛానెళ్లలో లైవ్ చూడవచ్చు. జియో హాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు.

రావద్దు, పాకిస్తాన్ లోనే ఉండండి

- శ్రీలంక క్రీడాకారులకు బోర్డు ఆదేశం

పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరుగుతున్న పేలుళ్లతో శ్రీలంక జట్టు వణికిపోతోంది. మూడు రోజుల క్రితం ఓ కోర్టు బయట బాంబు పేలి 12 మంది మరణించగా, 27 మందికి గాయాలయ్యాయి. ప్రస్తుతం శ్రీలంక, పాక్ జట్ల మధ్య రావల్పిండిలో వన్డే సిరీస్ జరుగుతోంది. ఇస్లామాబాద్, రావల్పిండిని 'ట్విన్ సిటీస్' అని పిలుస్తారు. అందుకే శ్రీలంక క్రీడాకారులు భయపడుతున్నారు. మెజారిటీ ఆటగాళ్లు పాకిస్తాన్ వదిలి వెళ్లాలని కోరుకుంటున్నారు. కానీ, పాకిస్తాన్ పర్యటనను కొనసాగించాలని శ్రీలంక క్రికెట్ బోర్డు జట్టును ఆదేశించింది. ఒకవేళ ఎవరైనా మధ్యలో నుంచి తిరిగి వచ్చేస్తే వారి మీద చర్యలు ఉంటాయని కూడా హెచ్చరించింది. బోర్డు ఆదేశాలకు ఎవరు విరుద్ధంగా ప్రవర్తించినా, వారి స్థానంలో కొత్తవారిని పంపుతామని బోర్డు స్పష్టం చేసింది. ఇటు పీసీబీ రెండో, మూడో వన్డే మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మార్చింది. రెండో మ్యాచ్ గురువారానికి బదులు శుక్రవారం నాడు, మూడో మ్యాచ్ శనివారానికి బదులు ఆదివారం నాడు రావల్పిండిలో జరుగుతాయి. అటు, పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ శ్రీలంక జట్టును, బోర్డును కొనియాడారు. వారి నిర్ణయం క్రీడా స్ఫూర్తి, సంఘీభావానికి ప్రతీకలని పేర్కొన్నారు. 2009లో పాకిస్తాన్‌లో శ్రీలంక క్రికెట్ జట్టు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రదాడి జరిగింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియానికి వెళ్తుండగా జరిగిన ఆ దాడిలో ఆరుగురు శ్రీలంక ఆటగాళ్లు గాయపడ్డారు. తర్వాత పాకిస్తాన్‌లో అంతర్జాతీయ క్రికెట్ చాలా కాలం పాటు నిలిచిపోయింది. 2011 ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ. ఆ అవకాశం కోల్పోయింది. అప్పటి నుంచి భారత్ పాకిస్తాన్ కే వెళ్లలేదు.

తిరిగి జట్టులోకి రానున్న స్టార్ ఆల్ రౌండర్

- బెంగళూరులో కోలుకుంటున్న హార్దిక్ పాండ్యా

టీ20 ప్రపంచ కప్ కోసం టీమిండియా తగు కసరత్తులు చేస్తోంది. ఈ మెగా టోర్నమెంట్‌కు సన్నద్ధమయ్యేందుకు సిద్ధమవుతోంది. ఆసియా కప్ 2025 సమయంలో హార్దిక్ పాండ్యా గాయంతో జట్టుకు దూరమయ్యాడు. పాకిస్తాన్‌తో జరిగిన కీలక ఫైనల్‌తో పాటు ఆస్ట్రేలియా పర్యటనకూ ఎంపిక కాలేదు. అయితే, హార్దిక్ పాండ్యా టీ20 ప్రపంచ కప్‌కు చాలా ముందుగానే తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఆసియా కప్‌లో శ్రీలంకతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ తర్వాత పాండ్యా తొలిసారి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున ఆడనున్నాడు. ఈ దేశీయ టోర్నీలో పాండ్యా మొదటి రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడు. దక్షిణాఫ్రికాతో వన్డే, టీ20 సిరీస్‌లలో టీమిండియాలోకి తిరిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పాండ్యా ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 26న బెంగాల్‌తో జరిగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌కు హార్దిక్ ఫిట్‌గా ఉంటాడని సమాచారం. ఆలస్యమైతే 28న పుదుచ్చేరితో జరిగే టోర్నమెంట్ రెండో మ్యాచ్ నాటికి ఖచ్చితంగా వస్తాడంటున్నారు. బరోడా మ్యాచ్‌ల తరువాత పాండ్యా నేరుగా హైదరాబాద్‌కు చేరుకుంటాడు. పాండ్యా చివరగా ఆడిన ఆసియా కప్ 2025 టోర్నమెంట్ అతనికి అంతగా కలిసి రాలేదు. ఐదు మ్యాచ్‌లలో కేవలం 48 పరుగులు చేసి, 4 వికెట్లు మాత్రమే తీయగలిగాడు.

కేకేఆర్ కోచింగ్ బృందంలో కీలక మార్పు

- అసిస్టెంట్ కోచ్‌గా షేన్ వాట్సన్ నియామకం

కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తమ కోచింగ్ బృందంలో కీలక మార్పు చేసింది. ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్‌ను అసిస్టెంట్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రధాన కోచ్, భారత మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్‌తో కలిసి షేన్ వాట్సన్ పని చేస్తాడు. 44 యేండ్ల వాట్సన్ ఆస్ట్రేలియా తరఫున 59 టెస్టులు, 190 వన్డేలు, 58 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచులు ఆడాడు. పది వేలకు మించి పరుగులు చేశాడు. 280 వికెట్లు పడగొట్టారు. ఐపీఎల్‌లో ఢిల్లీ కోచ్‌గా కూడా పని చేశాడు. తన నియామకంపై షేన్ వాట్సన్ సంతోషం వ్యక్తం చేశారు. కోల్‌కతా కోచింగ్ బృందం, ఆటగాళ్లతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఉన్నానని వాట్సన్ పేర్కొన్నాబు. షేన్ వాట్సన్ 145 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి నాలుగు సెంచరీలు చేశారు. గతంలో రాజస్థాన్, చెన్నై ఛాంపియన్ జట్ల తరఫున కూడా ఆడారు. 2008లో రాజస్థాన్ రాయల్స్ జట్టుకు తొలి ఐపీఎల్ టైటిల్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. 2013లో కూడా 'మోస్ట్ వాల్యూవబల్ ప్లేయర్' అవార్డును అందుకున్నాడు.

ప్రతిపక్షం
Prathipaksham.in
12
హైదరాబాద్
శుక్రవారం
14.11.2025

సినిమా

మన శంకరవరప్రసాద్ గారు

- ఫిలింనగర్ లో యాక్షన్ పార్ట్ షూటింగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు . 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ నేడు షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది.

అందాల రాశి

ఊహలు గుసగుసలాడే సినిమాతో పదేళ్ల క్రితం టాలీవుడ్‌లో మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేసింది. స్టార్ హీరోలకు ఈ అమ్మడు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోలేదు. అయినా కూడా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకోవడంలో సఫలం అయింది. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం తెల్సిందే. తాజాగా రాశి ఖన్నా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. క్లీ వేజ్ షో తో మతి పోగొడుతూ, లాంగ్ డ్రెస్‌లో రాశి చూపు తిప్పనివ్వడం లేదు అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సింపుల్ మేకోవర్‌తో పాటు, మేకప్, డ్రెస్‌కి తగ్గట్లుగా హెయిర్ స్టైల్ ఉండటంతో మెరిసి పోతుంది. రాశి ఖన్నా చూపుతో మతి పోగొడుతోంది అంటూ అభిమానులతో పాటు, అంతా కూడా తెగ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. ఆకట్టుకునే అందంతో పాటు ఎలాంటి ఔట్ ఫిట్‌లో అయినా రాశి ఖన్నా భలేగా ఆకట్టుకుంటుంది. అందుకే రాశి ఖన్నా ఎప్పుడు ఏ ఫోటోలు షేర్ చేసినా కూడా ఆకట్టుకుంటూ ఉంది. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి ఫోటోలు చూసినప్పుడు స్టార్ హీరోలు ఈమెకు ఆఫర్లు ఇవ్వకుండా తప్పు చేశారు అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తున్నారు.

తెలంగాణ గ్రామీణ ప్రేమకథ 'రాజు వెడ్స్ రాంబాయి'

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిస్తున్న ప్రేమకథా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. వరంగల్, ఖమ్మం సరిహద్దు గ్రామాల్లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. అఖిల్, తేజస్వి రావు జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకుడు. వేణు ఊడుగుల నిర్మిస్తున్నారు. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. సున్నితమైన హాస్యం, ఆలోచింపజేసే మాటలతో కల్మషం లేని ప్రేమకథతో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. ఈ సినిమా క్లైమాక్స్ గుండెలకు హత్తుకునేలా ఉండబోతున్నదని, 15ఏళ్లుగా దాచబడిన నిజమైన ప్రేమకథకు రూపమని, ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు మంచి ఆదరణ దక్కుతున్నదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని నిర్మాత వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200